

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 110 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 04 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



1959 - 2024

దివంగత షఫీఉల్లా ఖాన్

మాజీ మేనేజింగ్ ఎడిటర్


## రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారు




**హైదరాబాద్ :సమయజ్యోతి**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 2014 విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని ఏ రోజు మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ నిలదీయలేదు అని కేటీఆర్ గుర్తు చేశారు.ఎంత పెరిగినా గొర్రెకు బెత్తడే తోక అన్నట్లు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదన్నారు కేటీఆర్. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్.. తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాల మీద ఏ రోజు కూడా మాట్లాడలేదన్నారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీతో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.




## దేశానికి ఫ్యూచర్ సిటీని అందించబోతున్నాం

- పెట్టుబడుల ఆకర్షణలో ముందున్న తెలంగాణ
- అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్ నగరం
- ప్రపంచ నగరాలతోనే తమ పోటీ ఉంటుంది
- డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
- మలబార్ గోల్డ తయారీ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్

2లో.

**రంగారెడ్డి,జులై 3(సమయజ్యోతి):**

హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించ బోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు.

## గాజాపై ఐడీఎఫ్ భీకర దాడులు.. 82 మంది పాలస్తీనియన్లు మృతి



హమాస్ అంతమే లక్ష్యంగా గాజా పై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఐడీఎఫ్ జరుపుతున్న ఈ దాడుల్లో అనేక మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా గాజాపై ఇజ్రాయెల్ ( దళాలు గత రాత్రి వరుస వైమానికి దాడులకు పాల్పడ్డారు. పలు చోట్ల కాల్పులు జరిపారు. ఈ దాడుల్లో దాదాపు 82 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అందులో 38 మంది మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్న వారే. ఇక అనేక మంది గాయపడినట్లు పేర్కొంది. గాయపడ్డ వారు ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించింది.

## ప్రధాని మోడీకి ఘన అత్యున్నత పురస్కారం



- రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టిపు వాణిజ్యం
- ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు...పార్లమెంటులో ప్రసంగం
- భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన
- ఆశ్చర్య పోయిన పార్లమెంట్

**న్యూఢిల్లీ,జులై 3(సమయజ్యోతి):**

భరాత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్- ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరుదేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ ద్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇండియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్-ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు.




## అమెరికా ఆంక్షలపై అధ్యయనం

**లిండ్సే గ్రాహంతో టచ్‌లో ఉన్నాం**

**వాషింగ్టన్ మీడియా సమావేశంలో జైశంకర్**

**వాషింగ్టన్,జూలై3(సమయజ్యోతి):**



రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్నుతో 'ఆర్థిక బంకర్ బస్టర్' జారవిడుస్తామంటూ అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వాషింగ్టన్‌లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమెరికా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపనుండటంతో వాటిని జాగ్రత్తగా గమనిస్తున్నామన్నారు. భారత్ దౌత్య కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఆ బిల్లుకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న లిండ్సే గ్రాహంతో టచ్‌లో ఉన్నట్లు చెప్పారు.

## బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షం

**ప్రధాని మోడీతో అఖిలపక్షం కోసం బిజెపి రావాలి**

**రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ బిసి నేతలు ఒత్తిడి తేవాలి**

**17న రైల్ రోకోకు అన్ని పార్టీలు ముందుకు రావాలి**

**మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్**



**హైదరాబాద్,జూలై3(సమయజ్యోతి):**

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీకి అఖిలపక్షంను తీసుకుని వెళ్లాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోమారు డిమాండ్ చేశారు. దీనిపై తేల్చకుండా స్థానిక ఎన్నికలను నిర్వహించ రాదని అన్నారు. బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు.

2లో

# కేటీఆర్, హరీశ్ రావు కాదు..

## కేసీఆర్ మాట్లాడితే నేను మాట్లాడతా: కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

కేసీఆర్ అసెంబ్లీకి వస్తేనే చర్చకు సిద్ధమని స్పష్టీకరణ

కేటీఆర్, హరీశ్ రావులను తాము లెక్కలోకి తీసుకోబోమని వ్యాఖ్య

హరీశ్ రావు కేవలం ఎమ్మెల్యే మాత్రమేనని ఎద్దేవా

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పునరుద్ఘాటన

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, ఆయన వస్తే ప్రతిపక్షాలు కోరుతున్న అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఉన్నతాధికారులతో రోడ్ల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులను తాము అసలు లెక్కలోకే తీసుకోవడం లేదని కోమటిరెడ్డి అన్నారు. "నేను హరీశ్ రావు, కేటీఆర్ మీద మాట్లాడను. కేసీఆర్ మాట్లాడితే మాట్లాడతాను. వీరు ఫ్లోర్ లీడర్లు ఏమీ కాదు. మాజీ మంత్రులు, ప్రస్తుతం ఎమ్మెల్యేలు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో తాము కీలక పాత్ర పోషించామని, రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ తప్పుఒప్పులపై చర్చించాలంటే ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ సభకు రావాలని డిమాండ్ చేశారు.

## బైకును ఢీకొన్న భారీ వాహనం

ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

లక్నో,జులై 3(సమయజ్యోతి):

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హపూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హఫీజ్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ ను భారీ వాహనం ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. మజీద్ పూర్ కు చెందిన దినేష్ తన ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, స్నేహితుడు కుమారుడితో కలిసి బైక్ పై వెళ్తుండగా భారీ వాహనం ఢీకొట్టింది. ఐదుగురు ఘటనా స్థలంలోనే చనిపోయారు. ఎఎస్ పి వినీత్ భటాగర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్విమ్మింగ్ పూల్ నుంచి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో అగ్నిప్రమాదం

తిరుపతి,జులై 3(సమయజ్యోతి):

తిరుపతిలోని గోవిందరాజుస్వామి ఆలయం సమీపంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున గోవిందరాజు స్వామి ఆలయానికి సమీపంలో ఓ దుకాణంలో మంటలు చెలరేగడంతో భక్తులు పరుగులు తీశారు. దుకాణం నుంచి చలువ పందిళ్లకు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షాపుల్లో ఇత్తడి సామాన్లు, బొమ్మలు దగ్ధంకావడంతో ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం.

## అసంతృప్త ఎమ్మెల్యేలతో ఖర్గే భేటీ

మంత్రి పదవులు రానందుకు చింతవద్దని హితవు

హైదరాబాద్,జూలై3(సమయజ్యోతి):

రేవంత్ రెడ్డి కేబినెట్‌లో చోటు దక్కని అసంతృప్త ఎమ్మెల్యేలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. గురువారం రాత్రి తాజ్ కృష్ణా హోటల్‌లో ఖర్గేను ఎమ్మెల్యేలు ప్రేమసాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలు నాయక్ తదితరులు విడివిడిగా కలిశారు. ఈ సందర్భంగా తాము మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నామని పార్టీ అధినేత ఖర్గేకు వివరించారు. ఈ సందర్భంగా వారితో కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. ఆ క్రమంలో తొలుత ప్రేమ సాగర్ రావు.. ఖర్గేతో సమావేశమయ్యారు. కేబినెట్‌లో ఆయనకు చోటు కల్పించలేమంటూ ప్రేమ సాగర్ రావుకు ఖర్గే స్పష్టం చేశారు. అయితే చీఫ్ విప్ హోదా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ ఆఫర్‌ను ఆయన తిరస్కరించారు. అనంతరం అక్కడి నుంచి ప్రేమ సాగర్ రావు అలిగి వెళ్లిపోయారు. దీంతో ఆయనను బుజ్జగించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రంగంలోకి దిగారు. మరోవైపు రెడ్ల సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం ఉండక పోవచ్చని పలువురు ఎమ్మెల్యేలకు ఖర్గే స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. దీంతో మల్ రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్ రావులు అసంతృప్తిగా బయటకి వెళ్లిపోయారు. అలాగే మంత్రివర్గంలో సీనియర్లకు అవకాశం కల్పించాలని ఖర్గేను సుదర్శన్ రెడ్డి కోరారు. దీంతో ఆయనకు సైతం ఖర్గే సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఇంకోవైపు బంజారాలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించమని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. కష్టపడితే అవకాశాలు ఉంటాయని బాలు నాయక్‌తో ఖర్గే తెలిపారు. ఇక తనకు ముందస్తు కార్యక్రమం కారణంగా.. ఈ సమావేశానికి రాలేక పోతున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ సీనియర్లకు తెలిపారు. అయితే తనకు ఫోన్ కాల్ రాలేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి వెల్లడించారు. ఇక ఖర్గేతో భేటీ అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఖర్గే తమకు సమయం ఇచ్చి.. మాట్లాడారన్నారు. ఒక్కొక్కరిని విడివిడిగా మాట్లాడారని చెప్పారు. తాము చెప్పిన మాటలు ఖర్గే శ్రద్ధగా విన్నారని తెలిపారు. ఉమ్మడి 10 జిల్లాకు ఒక మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. ఇచ్చిన జిల్లాకే మంత్రులు ఇస్తే బాగోదని తాము సూచన చేశామన్నారు. రాష్ట్ర జనాభాలో 45 శాతం జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వలేదని గుర్తు చేశామన్నారు. సగం స్టేట్‌కి ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని పరిస్థితిని ఖర్గేకు వివరించామన్నారు.

## పదేళ్లపాటు బిసిలు యాదికి లేరా

ఎమ్మెల్సీ కవితకు మహేశ్ గౌడ్ చురకలు

హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):

ఎమ్మెల్సి కవిత ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాసింది బిఆర్ఎస్ నేతగానా? జాగృతి నాయకురాలిగానా? అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల కోసం కవిత ఉద్యమం ఎక్కడ చేసిందని అన్నారు. పదేళ్ల పాటు బిసిలు గుర్తుకు రాలేదా అంటూ కవితకు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బిసి బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. కవిత ఇప్పటిదాకా బిసిల కోసం ఒక్క మాట మాట్లాడిందా? అని అన్నారు. రాజకీయ శూన్యంలో ఉన్న కవిత ఉనికి కోసమే మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. పదేండ్లు బిసిలకు మాజీ సిఎం కెసిఆర్ ఏం చేశారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ లో కోవర్టులున్నారన్న ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలపై తీవ్రంగా పరిగణిస్తున్నామని, పార్టీ నేతలు మాట్లాడేటప్పుడు చూసుకుని మాట్లాడాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా? అని మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీపడేది లేదని, బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

మొదటిపేజీ తరువాయి

## దేశానికి ఫ్యూచర్ సిటీని అందించబోతున్నాం

మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని చెప్పారు. మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 'పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్సల్టెంట్స్ పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నాంఅని సీఎం తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధి ఎక్కువగా ఉందని.. 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 4,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు.



మొదటిపేజీ తరువాయి

## బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షం

జూలై 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేదని విమర్శించారు. రైల్ రోకోకు మద్దతు కోరుతూ బిఆర్ఎస్ సహా అన్ని పార్టీలకు లేఖ రాస్తామని చెప్పారు. గోదావరి- బనకచర్ల విషయంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోందని, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ను ఒక్క మాట కూడా అనలేడంలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంమై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను హైరదాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు. బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకోని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

## రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారు

తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా ఉండడం ముమ్మాటికి కుట్రే అన్నారు కేటీఆర్. గోదావరిలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను తన గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం లేదా పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలన్నారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్టిమెంట్ రీజియన్ (%×ు×=%) ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్ గాంధీ మాట మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారన్నారు. వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఇక బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్‌సభలో మాట్లాడలేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలుచేయలేక రేవంత్ రెడ్డి చతికిలపడితే రాహుల్ తప్పించుకు తిరుగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. హామీల అమలుకు తనదే గ్యారంటీ అని గప్పాలు కొట్టిన రాహుల్, ఇప్పుడు తెలంగాణకు రాకుండా ముఖం చాటేశారన్నారు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ను గెలిపించిన తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన శాపం రేవంత్ సర్కార్ అని కేటీఆర్ మండిపడ్డారు.

మొదటిపేజీ తరువాయి

## ప్రధాని మోడీకి అత్యున్నత పురస్కారం

అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు.'ఇవాళ మన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు, ఘనా బిడ్డ డాక్టర్ క్వామే న్క్రుమాకు నివాళు లర్పించే గౌరవం నాకు లభించిందని' అన్నారు. ఘనా పర్యటలో ప్రధాని మోదీ ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట రాజనీతి, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రామణి మహామా చేతుల మీదుగా ఘనా జాతీయ గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందుకున్నారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పిన మోదీ.. ఈ గౌరవాన్ని భారతదేశ యువత ఆకాంక్షలు, సాంస్కృతిక, సంప్రదా యాలు, వైవిధ్యం, ఇంకా ఘనా - భారత్ మధ్య చారిత్రక సంబంధాలకు అంకితం చేశారు. ఈ గౌరవాన్ని అందించినందుకు ఘనా ప్రజలకు, ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశంలో పర్యటించడం తనకు లభించిన గౌరవమని హర్షం వ్యక్తంచేశారు. ఘనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతోందని కొనియాడారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోంది. సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఆ మార్పునకు దోహదం చేస్తున్నాయి. గ్లోబల్‌సౌత్ గళం వినిపించకుండా ఆ పురోగతి సాధ్యంకాదు అన్నారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మా ప్రజలు సంకల్పంతో ఉన్నారు. బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది. ఆఫ్రికా అభివృద్ధి దిశగా చేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తాం. మన దేశాల పురోగతికి పరస్పరం సహకరించు కుందామని మోదీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం.

మొదటిపేజీ తరువాయి

## అమెరికా ఆంక్షలపై అధ్యయనం

'మా ఆందోళనలు, ఇంధన భద్రత ప్రయోజనాలను ఆయనకు తెలియజేసినట్లే భావిస్తున్నా. ఇక అవసరమైతే ఆ సమస్య వచ్చినప్పుడు ఎదుర్కోవాలని పేర్కొన్నారు. క్వాడ్ సమావేశంలో పాల్గొనడానికి నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వాషింగ్టన్‌కు వెళ్లిన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ,తమ ఆందోళనలను ఆ సెనెటర్‌తో ఇప్పటికే పంచుకొన్నామని ఆయన పేర్కొన్నారు. ఆ బిల్లు వాస్తవరూపం దాలిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై తమకు అవగాహన ఉందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం పరిస్థితిని మరింత జఠిలం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి అమెరికా చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్ను విధించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఈ బిల్లును ప్రస్తావించే సమయంలో సెనెటర్ లిండ్సే గ్రాహం భారత్, చైనా పేర్లను ముఖ్యంగా ప్రస్తావించడం గమనార్హం. ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యాను ఒప్పించేందుకు ఓ ఆయుధం వలే ఈ బిల్లును వాడాలని ట్రంప్ కార్యవర్గం భావిస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. ఇక, ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే దేశాల కోసం లిండ్సే మరో ఒప్పందాన్ని ప్రతిపాదించ నున్నట్లు తెలుస్తోంది. మరో 48 గంటల్లో భారత్- అమెరికా మధ్య మినీ ట్రేడ్ డీల్ ఓ కొలిక్కి వస్తుందన్న వేళ జైశంకర్ వ్యాఖ్యలు కీలకంగా మారాయి.

మొదటిపేజీ తరువాయి

## గాజాపై ఐడీఎఫ్ భీకర దాడులు..

### గాజాలో 58 వేలు దాటిన మృతుల సంఖ్య

ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం అక్టోబర్ 2023లో ప్రారంభమైన విషయం తెలిసిందే. హమాస్ ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రతీకారంలో ఇప్పటివరకు 58 వేలకుపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో పెద్ద సంఖ్యలో జనాభా నిరాశ్రయులయ్యారు. వేలాది మంది ఆకలి బాధలను ఎదుర్కొంటున్నారు.

### గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ : ట్రంప్

గాజా అంశంలో తమ ప్రతినిధులు ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ చర్చలు చేపట్టారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (%ణశీఅఖశ్రీ ఎతీబఎజూ%) తెలిపిన విషయం తెలిసిందే. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, ఆ సమయంలో అన్ని పార్టీలతో కలిసి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామన్నారు. శాంతి ఒప్పందం కోసం ఖతార్, ఈజిప్ట్ తీవ్రంగా ప్రయత్నించాయని, వాళ్లే దీనికి సంబంధించిన తుది ప్రతిపాదన చేస్తారన్నారు. మిడిల్‌ఈస్ట్ మంచి కోసం హమాస్ ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, గాజాపై యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామంటేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని హమాస్ సంస్థ తెలిపింది.

### హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం : ఇజ్రాయెల్ ప్రధాని

గాజా లో 60 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్ ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన విద్యా బోధన: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 03.**

ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన విద్యా బోధనకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం లక్ష్మణచందా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పి, ప్రశ్నలు అడిగి వారి ప్రతిస్పందనను పరీక్షించారు. అనంతరం విద్యా బోధన, వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి. రామారావు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫలించిన బీ జే పి నాయకుల ప్రయత్నం టెంబి నుండి ఆదర్శ పాఠశాల కు బస్ ప్రారంభం

**సమయజ్యోతి న్యూస్ జూలై 03 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలం లోని టెంబి మంజీరం తండా దేగము జాతర్ల గ్రామాల విద్యార్థులు ఆదర్శ పాఠశాలలో చదువుకుంటారు విద్యార్థుల ఇబ్బందులు ఆర్ టి సి డీ ఎం దృష్టి బీ జే పి నాయకుల తీసుకెళ్లడం తో స్పందించి బస్ ను ప్రారంభించడం జరిగింది ఈ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు



# ఎంబీసీ అభ్యర్థులకు స్కిల్ డెవలప్మెంట్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ యువకులకి వివిధ నైపుణ్యాలను (సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెజ్యూమ్ బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్ %డ% మెంటల్ వెల్బీయింగ్ ట్రైనింగ్) పెంపొందించడానికి హైదరాబాద్‌లో నాలుగు రోజుల ఉచిత శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ శిక్షణ (04) రోజులు ఇవ్వబడుతుందని ముఖ్య కార్య నిర్వహణ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు టావెలింగ్ అలవెన్స్, భోజన మరియు వసతి సదుపాయం కల్పిస్తారు. వయస్సు: 21 నుండి 30 సంవత్సరాల వరకు, డిగ్రీ ఉత్తర్ణత. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం (ఎంబిసి 36 కులాల వారు మాత్రమే). ఆదాయం గ్రామీణంలో 1.50 లక్షల వరకు, పట్టణంలో 2.00 లక్షల వరకు ఉండాలి. ఈ నెల 12 లోపుగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ %స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% దరఖాస్తు ద్వారా దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు ఫారాలకు సంబంధించిన ధృవ ప్రతులను జిల్లా బీసీ అభివృద్ధి అధికారికార్యాలయంలో ఈనెల 14 సాయంత్రం 5:00 గంటల లోగా సమర్పించాలి.

# మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభను విజయవంతం చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఈనెల 4న హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో నిర్వహించనున్న బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే విచ్చేయనున్నారని, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, భారీ ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని గురువారం సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి వాట్సాప్ వేదికగా ప్రకటించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం. గాంధీ భవన్ లో పీసీసీ, పీఏసీ సమావేశాలు ఉంటాయని అన్నారు.



# డివిజన్ ప్రధాన సమస్యలు త్వరలో పరిష్కారం కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

డివిజన్ లోని ప్రధాన సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని రామచంద్రాపురం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబెర్ బూరుగడ్డ పుష్పానగేష్ అన్నారు డివిజన్లో ఇంకా భూగర్భ మురుగునీటి పైప్ లైన్ లు వేయాల్సిన అవసరం ఉందని అందులకై గురువారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని ఖైరతాబాద్ లోని ఆయన కార్యాలయం లో కలిసి వినతిపత్రం అందచేసినట్లు కార్పొరేటర్ దంపతులు తెలిపారు డివిజన్ లోని కొన్ని భూగర్భ మురుగు నీటి పైప్ లైన్ లకు నిదులు మంజూరు చేసిన ఎండి అశోక్ రెడ్డి కి కార్పొరేటర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు



# ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డుకు ఇల్లంతకుంట మండల సమాఖ్య ఎంపిక

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

స్వయం సహాయక సంఘాలకు విశిష్ట సేవలందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైంది. వచ్చే నెల ఆగస్టు 15న ఢిల్లీలో అవార్డుల ప్రధాన ఉత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానం అందింది. జిల్లాలోని మండల సమాఖ్య జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక అవడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. వారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోని ఆదర్శ మండల సమాఖ్య ఎస్ హెచ్ జి స్వయం సహాయక సభ్యులకు సేవలందిస్తోంది. ఈ మండల సమాఖ్య పరిధిలో 46 విలేజ్ ఆర్గనైజేషన్(వీఓ)లు ఉండగా 1103 స్వయం సహాయక సంఘాలు 11వేలకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు.లిఆర్థిక, సామాజిక సేవలు అందిస్తూ..ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గత ఐదేళ్ల కు పైగా ఎస్ హెచ్ జి సభ్యులకు రుణాలు అందించడం వాటిని క్రమం తప్పకుండా చెల్లించేలా చూడడం సభ్యులకు భీమా కల్పించడం తదితర సేవలు అందిస్తుంది. ఎస్ హెచ్ జీ సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణించేలా నిరంతరం శిక్షణ, సలహాలు అందిస్తున్నారు. అలాగే సామాజిక బాధ్యత కింద అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, నీటి వనరుల సంరక్షణ ప్లాస్టిక్ వినియోగించవద్దని, సైబర్ మోసాలకు గురి కావద్దని తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు జీవనోపాదులు పెంచే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.లి22 సీఎల్ఎఫ్ లు ఎంపికదేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమాఖ్యల పనితీరును పరిశీలించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ లో భాగంగా ఉత్తమ సేవలు అందిస్తున్న మండల సమాఖ్యలను గుర్తించి లిఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డు 2024లి ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి 22 మహిళా సంఘాలను ఎంపిక చేసింది. అవార్డులకు దేశంలోని ఆరు రీజియన్ల పరిధిలో 22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు(సీఎల్ ఎఫ్)లు ఎంపిక కాగా.. సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య రెండో స్థానంలో నిలిచి ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖకు లేఖ అందింది. రానున్న ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద నిర్వహించనున్న అవార్డుల ప్రదాన ఉత్సవానికి రావలసిందిగా ఆహ్వానం అందింది. ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు అక్కడికి వెళ్లి అవార్డును



స్వీకరించనున్నారు. లికలెక్టర్ అభినందనలులిఇల్లంతకుంట మండలం ఆదర్శ మహిళా సమాఖ్య ఉత్తమ సేవలందించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, అలాగే మండల సమాఖ్య బాధ్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాప్రత్యేకంగా అభినందించారు. దీనికి కృషి చేసిన సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల గురుకుల వసతి గృహం, పెద్దూర్ లోని మహాత్మా జ్యోతి భాపూలే వసతి గృహాలు, సిరిసిల్ల పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల వసతి గృహం, తంగళ్ళపల్లిలోని మైనార్టీ బాలికల హాస్టల్, బద్దెనపల్లి, నేరెళ్లలోని బాలికల రెసిడెన్షియల్ విద్యాలయానికి కలెక్టర్ చేరుకొని ముందుగా ఆయా హాస్టళ్ల పరిసరాలు, కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు తదితరులు తనిఖీ చేశారు. మండేపల్లిలోని మైనార్టీ బాలుర వసతి గృహంలో సౌకర్యాలు సరిపడా లేకపోవడంతో వారికి కేంద్రీయ విద్యాలయానికి సంబంధించిన గత భవనాన్ని వినియోగించాలని సూచించారు. పెద్దూర్, మండేపల్లిలోని ఆర్ఓ ప్లాంట్లు రెండు రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.తాజా, నాణ్యమైన కూరగాయలు, పండ్లు నిత్యం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణ వంట గదులు తదితర పరిసరాలు కచ్చితంగా పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు.



నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత కోసం మున్సిపల్, అలాగే పంచాయతీ అధికారులతో చేయించాలని సూచించారు. విద్యాలయాల్లో సంక్షేమ వసతి గృహాల్లో ఎంతమంది విద్యార్థులు ఉండవచ్చు ప్రస్తుతం ఎందరున్నారో ఆరా తీశారు. వారికి సరిపడా టాయిలెట్లు, బెడ్స్, డెస్క్ లు ఉన్నాయని ఆ విద్యాసంస్థల బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయా హాస్టళ్లలో రోజు అందిస్తున్న భోజనం పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సామగ్రి అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళా సంక్షేమ వసతి గృహాల్లో అందరూ మహిళా సిబ్బంది ఉండాలని, అలాగే పురుషుల సంక్షేమ వసతి గృహాల్లో పురుషులే ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు విద్యాలయాల్లో హాస్టల్లో పనిచేసే సిబ్బంది అంతా స్థానికంగానే ఉండాలని ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు నిల్వ చేసే స్టోర్ రూమ్ లలోకి కీటకాలు, ఈగలు, దోమలు రాకుండా ఎలక్ట్రిక్ మిషన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా ప్రజా సంబంధాల అధికారి వి.శ్రీధర్, ప్రిన్సిపాళ్లు ఉన్నారు.

# సాదా బైనమాలు అమలు చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

భూభారతి కార్యక్రమాల్లో భాగంగా రైతులకు సాదా బైనామాలు అమలు చేయాలని వేద పండితులు, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మద్దికుంట మాజీ సర్పంచ్ శాస్త్రుల మెట్టు రామశర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు మేలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవడం, భూ సమస్యలు తీర్చుడం సంతోషదాయకం. చాలా సంవత్సరాల నుంచి సాదా బైనామాలు పెండింగ్ లో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితి భూ యజమానులు చాలామంది మరణించారు. వారసుల వలన కొన్ని సమస్యలు వస్తున్నాయి. దీన్ని ప్రభుత్వ అధికారులు వాస్తవాలను గ్రహించి సాగులో ఉన్నవారికి సాదా బైనామా అమలు చేయవలసిందిగా కోరుతున్నాం.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# పరిశ్రమల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిట్ జరగాలి

పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ఇది ఒక్క పాశమైలారం గురించే కాదు... దేశమంతా ఇదే దుస్థితి నెలకొంది. ప్రధానంగా ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు వ్యవహారం సద్దుమణిగాక పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ప్రమాదాల్లో ఎంతమంది మరణించారో కూడా లెక్కలు తెలియడం లేదు. సరికదా తెలుసుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి నిత్యం వల్లెవేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే పారిశ్రామిక వాడలు ఉన్న ప్రాంతాల్లో వంద పడకల బర్న్స్ వార్డులతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి నెలా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అనుసరించేలా ఒత్తిడి తేవాలి. ఇప్పటికే పాశమైలారంనకు సంబంధించి అనేకమంది బాధితులు ఆస్పత్రి ముందు వచ్చి రోదిస్తున్నా..స్పందించడం లేదు. మావారు ఏమయ్యారన్న ప్రశ్నలకు సమాశానం రావడం లేదు. ప్రమాదం జరిగిన సోమవారం నాడు పరిశ్రమలోకి ఎంతమంది వెళ్లారనడానికి సరైన లెక్కలు లేవు. దీనికి కూడా కారణం ఉంది. మనుషులతో పాటు, రికార్డులు కూడా బుగ్గికావడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ చరిత్రలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదంగా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండిస్ట్రీస్ లిమిటెడ్ దుర్ఘటన నిలిచిపోయింది. ఇప్పటికి 40 మంది కార్మికులు మరణించగా, మరో 37 మంది తీవ్రంగా గాయపడినట్టు గుర్తించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న 147 మందిలో మిగిలిన వారి కోసం రెండు రోజులుగా గాలింపు కొనసాగుతూనే ఉంది. కొందరి గుర్తింపు భారంగా మారింది. డిఎన్ఎ టెస్టులు కూడా కష్టంగానే మారాయి. బూడిదకుప్పల నుంచి డిఎన్ఎ టెస్టు చేయడం సాధ్యం కావడం లేదని సమాచారం. ఇకపోతే ఉద్యోగానికి వెళ్లిన వారెంతమంది అన్నది ప్రాథమికంగా తేల్చాలి. అప్పుడే ఎంతమంది చనిపోయారన్నది తెలుస్తుంది. ఎందుకంటే నవ్వుతూ ఉద్యోగానికి వెళ్లిన కార్మికులు బూడిద కుప్పలుగా మారారు. డిఎన్ఎ ఆధారంగా వారి అవశేషాలను గుర్తించాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే తమవారు ఏరీ అని అడిగే వారి కుటుంబాలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం, అధికారులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు. కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే హైదరాబాద్ శివారు ఔషధ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంగా చెప్పుకోవాలి. హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లోనే గత రెండు మూడు నెలల్లో నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. విశాఖలో 2020 నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం 12 మంది కార్మికులను బలిగొంటే, చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ విషతుల్యంగా మార్చి, వందలమందిని ఆసుపత్రుల పాలు చేసింది. ఆ తరువాత అచ్యుతాపురం సెజ్‌లో 2022 జూన్, ఆగస్టులో 500 మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ప్రమాదంపై నివేదిక అమలు మాట అటుంచి వెలుగుచూసిన పాపానే పోలేదు. గత ఏడాది అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలోనే 17 మంది మరణించగా, 38 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే అనకాపల్లి జిల్లాలో జరిగిన 11 ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఎనిమిదిమంది తీవ్ర గాయాలతో మంచంపట్టారు. పరవాడ ఫార్మాసిటీలో గత ఏడాది విషవాయువుల లీకేజిసహా పలు ప్రమాదాల్లో 10 మంది మరణించగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలవకుండా, లాభం కోసం భద్రతను గాలికొదిలేసి ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమల అధిపతుల పక్షాన కేంద్ర, రాష్ట్ర పాలకులు నిలవడం మరింత విషాదం. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల్లో రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నారు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడమే భారీ ప్రమాదాలకు కారణమన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ హెచ్చరికలను ఇప్పటికైనా గుర్తించి, కఠిన చర్యలకు ఉపక్రమించాలి. యాజమాన్యాలు అత్యాశతో రసాయన, ఔషధ పరిశ్రమలుసహా వివిధ పరిశ్రమల్లో అత్యంత కీలకమైన స్థానాల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేసే తగిన నైపుణ్యం, విద్యార్హత లేని వారిని, ఇతర రాష్ట్రాల వారిని కాంట్రాక్ట్, డైలీవేజ్ ప్రాతిపదికన నియమిస్తున్నాయి. కాలం చెల్లిన రియాక్టర్లు, యంత్రాలను వినియోగించడం తోపాటు వాటికి దగ్గరగా వెల్డింగ్, షోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రతాపరమైన పరికరాలు, తగిన శిక్షణ ఇవ్వకపోవడం, భద్రతా తనిఖీలు జరగకపోవడం పలు రసాయనాలను దగ్గరగా నిల్వచేయడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు నివేదికలు ఘోషిస్తు న్నాయి. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి, తమకు జరిగిన అన్యాయాన్ని,యాజమాన్యా ల దుర్మార్గాన్ని ప్రశ్నించలేని స్థితికి కార్మికులను నెట్టేసిన తీరు పాలకుల నిరంకుశ విధానాలకు నిదర్శనం గా చూడాలి. కార్పొరేట్లకు కొమ్ముకాయడం మాని, సేఫ్టీ వర్క్ లాంటి కార్మిక అనుకూల నినాదాలను తీసుకోవడం తక్షణ అవసరం. కార్మికుల సంక్షేమం ద్వారానే సంస్థలు బలపడాలి తప్ప, కార్మికులను పొట్టన పెట్టుకుని ముందుకు సాగాలన్న విధానాలకు పాతరేయాలి. ముందుగా తెలంగాణ, ఎపిల్లో ఉన్న పారిశ్రామిక వాడల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిటింగ్ చేపట్టాలి. ఆయా పరిశ్రమల్లో నాణ్యతాపరమైన, భద్రతాపరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్నది విశ్లేషించాలి. అప్పుడే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలం.

# తెలంగాణ సాయుధ పోరాట జ్వాల దొడ్డి కొమురయ్య



సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

నిజాం నిరంకుశత్వాన్ని, దొరల దాష్టీకాలను మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. 'బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందాయి. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అనగానే మొట్టమొదటగా స్ఫురించే విప్లవ జ్వాల దొడ్డి కొమురయ్య. అందువలన తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం 'భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం' అనే నినాదాలుగా మారుమోగి ఉద్యమం సాయుధ పోరాటంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణం అని చెప్పవచ్చు. జనగామ జిల్లా లోని కడివెండి గ్రామంలో కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబములో దొడ్డి కొమురయ్య 1927 ఏప్రిల్ 3 నాడు జన్మించాడు. తెలంగాణలో భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య. విస్నూర్ గ్రామంలోని దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ప్రజల పట్ల అతి క్రూరంగా వ్యవహరించేవారు. ఆయన తల్లి జానకమ్మ దొరసాని కడివెండి గ్రామంలో ఉండి ప్రజల చేత 'దొరసాని' అని పిలిపించుకునేది. ఆమె కడివెండి గ్రామాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకొని ప్రజానీకం పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారు. అలాగే నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, భూస్వాములు ప్రజలపై జులుం చెలాయించేవారు. ఈ అణచివేతలని ఎదుర్కోవడానికి 1944 భువనగిరి ఆంధ్ర మహాసభ ఆశాకిరణంగా నిలిచింది. దొరలు – భూస్వాములు కొనసాగిస్తున్న దోపిడి – దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆరుట్ల రాంచంద్రారెడ్డి కడివెండి గ్రామ ప్రజలకి చైతన్యాన్ని రగిలించారు. గొల్ల, కురుమల నాయకుడు గాను, ఆంధ్ర మహాసభలో సభ్యుడిగాను ఉన్న తన అన్న దొడ్డి మల్లయ్య ప్రభావంతో దొడ్డి కొమురయ్య ఆ సంఘంలో చేరి దొరలకు వ్యతిరేకంగా పోరాడాడు. తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకొని వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టింది. దీనిని సహించని దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక పన్నాగాలు పన్నారు. వందలాది మంది ప్రజలు రైతులు సంఘం పిలుపు అందుకొని 1946 జూలై 4 సాయంత్రం కడివెండి గ్రామంలో దొడ్డి మల్లయ్య నేతృత్వంలో ఊ ే ం గ ి ం ప ు తో బయలుదేరారు. విస్నూరు రామచంద్రారెడ్డి రౌడీలు 40 మంది ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో దొడ్డి కొమురయ్య కడుపులోకి తూటా దిగడంతో ఆయన కుప్పకూలి 'ఆంధ్రమహాసభకు జై', 'కమ్యూనిస్టు పార్టీకి జై' అని నినదిస్తూ వీర మరణం పొందాడు. తెలంగాణ రైతాంగ పోరాటంలో అమరుడైన తొలి వ్యక్తిగా దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. దొడ్డి కొమురయ్య మరణ వార్తతో చుట్టుపక్కల గల గ్రామాల ప్రజలంతా ఆవేశపూరితులై కడివెండి గ్రామానికి చేరుకుని ప్రతీకార చర్యలలో భాగంగా కర్రలు, బడిశెలు, గునపాలు అందుకుని దొర గూండాలను తరిమికొట్టారు. దొడ్డి కొమురయ్య బలి దానం తెలంగాణ సాయుధ పోరాటానికి ఆజ్యం పోసింది. క్రమంగా సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం దిశగా ఉద్యుక్తులు అయ్యారు. ఆ రకంగా దొడ్డి కొమురయ్య హత్యతో శాంతియుతంగా సాగుతున్న రైతాంగ ఉద్యమం సాయుధ విప్లవోద్యమంగా మారింది. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడుగా ప్రజా హృదయాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని పదిలపరచుకున్న దొడ్డి కొమురయ్య జయంతి (ఏప్రిల్ 3) మరియు వర్ధంతి (జూలై 4) లను అధికారికంగా నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 2 నాడు ఉత్తర్వులు జారీ చేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతుండడాన్ని 'ప్రజా పోరాటాల విజయాలను సమున్నతంగా ఎత్తిపడుతుంది' అని సగర్వంగా చెప్పవచ్చు. అదేవిధంగా జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరుని పెట్టాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

**( జూలై 4 దొడ్డి కొమురయ్య వర్ధంతి )9848445134**

# ఆరోగ్య పాఠశాల 2వ విడత కార్యక్రమం ప్రారంభం

## - జిల్లా కలెక్టర్ రాజార్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**




ఆరోగ్య పాఠశాల ఉన్నత భవిష్యత్తు కై ఆరోగ్య కరమైన అలవాట్లు రెండవ విడత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రణదీవెనగర్ లో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆరు సూత్రాల పై రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించి,విద్యార్థులు ప్రదర్శించిన మొబైల్ వాడకం పై వచ్చే అనారోగ్య సమస్యల పై స్క్రిప్ట్ ను తిలకించి విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల – ఆరోగ్య కళాశాల కార్యక్రమం: ఒక వినూత్న దిశగా ప్రయాణం చేసేందుకు ముందడుగు వేసిందని అన్నారు.ఈ సంవత్సరం జిల్లాలోని 251 పాఠశాల,కళాశాలల్లో జరుపుకుంటున్న ఆరోగ్య పాఠశాల – ఆరోగ్య కళాశాల కార్యక్రమం,విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించి,వారి భవిష్యత్తుకు బలమైన పునాదులను ఏర్పరిచే దిశగా ముందుకు వెళుతుందని,ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు శారీరక,మానసిక,ఆహార సంబంధిత ఆరోగ్యంపై అవగాహన కల్పించబడుతోందన్నారు.పిల్లలు ఆరోగ్యంగా ఉంటే,వారు బోధించే విద్యను ప్రభావవంతంగా గ్రహించగలుగుతారని ఇదే రీతిలో వారు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారన్నారు.దేశవ్యాప్తంగా ప్రాధాన్యత గల ఎన్ఐటిఐ ఆయోగ్ (నేషనల్ ఇన్స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్ఫర్మింగ్ ఇండియా) సమావేశం ఇటీవల జరిగిందని ఇందులో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారని చెప్పారు.ఆ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు కూడా హాజరై,"తెలంగాణ 2047" అనే దృక్కోణాన్ని (విజన్ డాక్యుమెంట్) ప్రవేశపెట్టారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.తెలంగాణ 2047 విజన్ – యువత పాత్ర,ఆ డాక్యుమెంటరీ ప్రకారం,తెలంగాణ రాష్ట్రం వచ్చే 10 సంవత్సరాలలో 1 బిలియన్ డాలర్ ఎకానమీగా,2047 నాటికి 3 బిలియన్ డాలర్ ఎకానమీగా మారే లక్ష్యాన్ని నిర్దేశించుకుందన్నారు.ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే,వ్యవసాయం,పరిశ్రమలు,చిన్నతరహా వ్యాపారాలు సహా అన్ని రంగాలలో ఉత్తమ పనితీరు అవసరమన్నారు.ముఖ్యంగా యువత ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలని,ప్రస్తుతానికి దేశ జనాభాలో అత్యధిక శాతం యువతే ఉన్నారు.ఇది మనకు ఒక గొప్ప అవకాశంగా మారుతుందని,అయితే దీనిని వాడుకోవాలంటే విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలన్నారు.ఈ సంవత్సరం ప్రత్యేకత కేవలం కార్యక్రమాన్ని జరుపుకోవడం మాత్రమే కాకుండా విద్యార్థులలో సమగ్ర అభివృద్ధి,నాలెడ్జ్ తో పాటు ఆరోగ్యం అనే భావనను నాటేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని,విద్యార్థులు ఒక ప్రాజెక్టును తయారు చేసే సమయం,ఖర్చు,అమలులో వచ్చే ప్రాక్టీకల్లి లెర్నింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండేలా చేస్తామని,ఈ కార్యాచరణ ద్వారా మన రాష్ట్ర లక్ష్యాలను సాధించడంలో విద్యార్థులు కీలకంగా మారతారని ఆశిస్తున్నానన్నారు.గత సంవత్సరం మీరందరూ చాలా చురుకుగా ప్రోగ్రాంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని,పేరెంట్స్ ఉపాధ్యాయులు విద్యాశాఖ ఇంటర్మీడియట్ కాలేజీలు తదితర అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు.ఈసారి హై స్కూల్ తో పాటు అప్పర్ ప్రైమరీ స్కూల్ కూడా ఈ కార్యక్రమంలో చేర్చడం జరిగిందని,జిల్లాలో 251 స్కూళ్ల ల్లో దాదాపు 40 వేల మంది విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని ఈ రోజు 2025 జులై 3 నుండి 2025 డిసెంబర్ 31 వరకు 6 నెలల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రతీ నెల సమావేశాలు నిర్వహించి స్టూడెంట్ చాంపియన్ లకు సర్టిఫికెట్స్ అందించడం జరుగుతుందన్నారు.జిల్లాలో ఉన్న రిసోర్స్ పర్సన్స్ ద్వారా ఆరు అంశాల పై విద్యార్థులకు అనువుగా ఉండేవిధంగా పుస్తకాలు రూపొందించడం జరిగిందన్నారు.బాలికలు కొన్ని సందర్భాల్లో బడికి రావడం మానేస్తున్నారు.ఈ విషయాన్ని గమనించి పాఠశాలల్లో టాయిలెట్స్,సానిటరీ నాప్కిన్ మిషన్ లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో గురువారం రణదివెనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన టాయిలెట్స్,సానిటరీ నాప్కిన్ మిషన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించి అనంతరం విద్యార్థులకు సైకిల్స్ ను అందజేసి మొక్కలను నాటారు.ఆరోగ్య పాఠశాల కార్యక్రమం లో భాగంగా డీపీఆర్ఓ ఆద్వర్యంలో సారధి కళాకారులచే వారి ఆట పాటలతో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని అవగాహన కల్పిస్తున్నారు.విద్యా వైద్యం,డీపీఆర్ఓ,డిడబ్ల్యూఓ,ఆయుష్,ఆర్బిఎస్కె శాఖల ద్వారా ఆయ శాఖలకు సంబంధించిన అంశాల పై కూడా అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఆరు రోజుల పాటు ఒక్కోక్క రోజూ ఒక్కో అంశం పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో విద్యా అధికారి శ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మణ్,ఆర్ఎం రాంచందర్ రావు,లీడ్ బ్యాంక్ మేనేజర్,అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మెన్ గంగాసాగర్,ఉపాద్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, బ్యాగులు పంపిణీ చేసిన బిజెపి

**సమయ జ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

పట్టణంలోనిఅందుగులపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుక్కులు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేసిన భారతీయ జనతా పార్టీ. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడమే కాకుండా విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి భారతీయ జనతా పార్టీ తరఫున కృషి చేస్తామని తెలిపారు అందులో భాగంగా ఈరోజు మందమర్రి మండలం అందుగుల పేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, బుక్కులు, పెన్నులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఇకపై ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవి సాగర్ రావు రాష్ట్ర నాయకుడు అందుగుల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు జనార్ధన్, ఇన్చార్జ్ సంజీవరావు, కన్వీనర్ అక్కల రమేష్, పట్టణ అధ్యక్షుడు నరేష్, సంతు రామ్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# కూచాడి శ్రీహరి రావును పరామర్శించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 03**

జ్వరంతో అస్వస్థకు గురై సోమాజిగూడ హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని వాకబు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# యువత ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం కార్పొరేటర్ సింధుఆదర్శ్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

యువత ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని పటాన్చెరు నియోజకవర్గం భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు గురువారం వార్డ్ కార్యాలయంలో జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సొసైటీలకు చెందిన యువకులకు సభ్యులకు ఆటలకు అవసరమైన క్రీడా సామగ్రిని కార్పొరేటర్ శ్రీమతి సింధుఆదర్శ్ రెడ్డి పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరం అని క్రీడల ద్వారా శారీరక ధృడత్వంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందని అన్నారు భవిష్యత్తులో క్రీడల అభివృద్ధికి తగిన ప్రోత్సాహం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో కాలనీ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# బహుజన్ సమాజ్ పార్టీలో పలువురు చేరిక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

పట్టణానికి చెందిన పలు మైనారిటీలు బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్ ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీలో చేరారు షేక్ రహీం బాబా, ఎస్ కే వాజీద్, షేక్ సర్ఫే అలం లకు జిల్లా అధ్యక్షుడు ముల్కల రాజేంద్ర ప్రసాద్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ముల్కల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలు జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతామని జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను ఇప్పటికే సంసిద్ధం చేశామని తెలిపారు జడ్పీ చైర్పర్సన్ ఎన్నికలో బహుజన్ సమాజ్ పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి మతిన్ ఖాన్ పాల్గొన్నారు.



# రైతులకు ఎరువులు,యూరియాను అందుబాటులో ఉంచాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా వ్యవసాయ శాఖ,మార్క్ ఫెడ్,కో ఆపరేటివ్ శాఖ అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి,జిల్లాలో యూరియా, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచే విషయంలో అధికారులకు పలు ముఖ్య సూచనలు జారీచేసారు.ప్రతిరోజు ఎరువుల దుకాణాలు సమయం ఉ.7:30 నుండి 8:00 మధ్య తెరిచి,రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.దుకాణాల ముందు రైతులు లైన్లు కట్టేవరకు వేచి చూడకూడదని,ప్రైవేటు డీలర్లు లేని మండలాలలో,పిఎసిఎస్,ఏఆర్ఎస్ కే వంటివి దుకాణాలలో సరిపడా ఎరువుల నిల్వలు ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ - పిఓఎస్ మెషీన్ల ద్వారా ఎరువుల అమ్మకాలు చేయాలని,ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న ఎరువుల నిల్వలను,ఎటువంటి లింక్ లేకుండా రైతులకు అమ్మేవిధంగా జాగ్రత్త వహిందాలని సూచించారు.ప్రతి ఎరువుల దుకాణం వద్ద వ్యవసాయ విస్తరణాధికారిని నియమించి,ఎరువుల అమ్మకాలు సజావుగా సాగేవిధంగా చూసుకునేలా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు.తదనుగుణంగా 2,3 ఎరువుల దుకాణాలలో ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించడం జరిగిందని,ప్రతిరోజు ఎరువుల దుకాణంలో గత వారపు సగటు అమ్మకాలను ఆధారంగా చేసుకుని,రానున్న నాలుగు రోజులకు సరిపడా ఎరువులు ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మార్కెఫెడ్ డీఎం ఎరువులు సకాలంలో త్వరితగతిన అందుబాటులో ఉంచేలా,ఎటువంటి జాప్యం లేకుండా ఎరువుల లారీలు పంపాలని ఉదయమే 7:30 నుండి 8:00 మధ్యలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓ లు అమ్మకాలు మొదలయ్యేలా చర్యలు తీసుకునే విధంగా చూసుకోవాలని డీసీఓ ను ఆదేశించారు.మండల వ్యవసాయ అధికారులు,సహాయ వ్యవసాయ సంచాలకులు,జిల్లా వ్యవసాయ అధికారి తమ పరిధిలోని ఎరువుల దుకాణాలలో విస్తృతంగా పర్యటించి,తనిఖీలు నిర్వహించి,ఎరువుల పంపిణీలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



# ప్రజలందరూ సుఖ సంతోశాలతో ఉండాలి ఎమ్మెల్యే జీ ఎం ఆర్

**సమయజ్యోతిన్యూస్ రామచంద్రాపురం**

శ్రీ వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పటాన్చెరువు పట్టణంలోని చైతన్య నగర్ ఏడుగుళ్ళ పోచమ్మ ఆలయంలో నిర్వహించిన హెూమం ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు



# జగ్గయ్య పేట బడికి పోటెత్తుతున్న బడి పిల్లలు

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**

భూపాల్ పల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం జగ్గయ్యపేట గ్రామంలో బడి బాటలో భాగంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ప్రభుత్వము అందచేస్తున్న సదుపాయాలను,నాణ్యమైన విద్య వంటి అంశాలను ప్రజల మధ్యకు సమర్ధవంతంగా తీసుకొని అవగాహన కల్పించడం వలన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల కృషి ఫలితంగా పాఠశాలలో అధిక మంది విద్యార్థులు ప్రవేశం పొందడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అనుభవం కలిగిన ,సమర్థులైన ఉపాధ్యాయులచే ఉత్తమమైన విద్య ప్రమాణాలతో నాణ్యమైన బోధన వల్ల గ్రామ ప్రజలకు విశ్వాసము నమ్మకం కలిగినందున ప్రైవేటు పాఠశాల నుండి మరియు గ్రామ దూర ప్రాంతాలలో చదువుతున్న గురుకుల విద్యార్థుల సైతం జగ్గయ్యపేట ప్రభుత్వ పాఠశాలకు రావడం వారి పనితీరుకు నిదర్శనం ఆరవ తరగతిలో 16మంది, ఏడవ తరగతిలో 9 మంది, ఎనిమత 8వ తరగతిలో7మంది, తొమ్మిదో తరగతిలో 1కరు, పదవ తరగతిలో ఇద్దరు విద్యార్థులు ఈ సంవత్సరం ప్రవేశం పొందడం సంతృప్తినిచ్చిందని ప్రధానోపాధ్యాయులు ఒంటేరు చంద్రశేఖర్ తెలియచేశారు .తల్లిదండ్రుల విశ్వాసం




కోల్పోకుండా విద్యార్థుల యొక్క సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అందరూ కృషిచేసి విద్యార్థుల భవిష్యత్తుపై పాటుపడతారని ,అధిక శ్రద్ధ తీసుకుంటారని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తెలిపారు విద్యార్థుల క్రమశిక్షణకై బూట్లు, పిఈటి డ్రెస్, ఐడి కార్డ్స్, బెల్ట్, టై అందజేస్తున్నామని తెలిపారు.

# నేడు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ కాంగ్రెస్ శ్రేణులకు కంది శ్రీనివాసరెడ్డి పిలుపు హాజరుకానున్న- ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :రి**

జై బాపు,జై భీం,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా,నేడు శుక్రవారం హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి,భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పాల్గొంటున్న సందర్భంగా,గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.పార్టీని గ్రామస్థాయిలో సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి,ఎలా ముందుకు తీసుకువెళ్లాలి,అందుకు తీసుకోవల్సిన చర్యలపై పార్టీ శ్రేణలకు,ఖర్గే దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల తీరు తెన్నులపై పార్టీ శ్రేణులతో చర్చించడంతో పాటు,ప్రజా సంక్షేమ పథకాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్న తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు సూచనలు,సలహాలు తెలియజేయనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలోతరలివచ్చి విజయవంతం చేయాలని,ఖర్గే సందేశాన్ని గ్రామాలలోని ప్రజలకు చేరవేయాలని సూచించారు.



# సాత్నల్ గ్రామ జామిని పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ప్రారంభం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి జైనత్,**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు జైనత్ మండలం సాత్నల్ గ్రామంలోని జామిని ప్రాథమికోన్నత పాఠశాలలో "ఆరోగ్య పాఠశాల" కార్యక్రమం జూలై 3వ తేదీన ప్రారంభమైంది. ఈ కార్యక్రమం డిసెంబర్ 31వ తేదీ వరకు మొత్తం 24 వారాలు కొనసాగనుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి ఉత్తమ పాలన కేటగిరీలో దేశంలో అత్యున్నతమైన స్కోచ్ అవార్డు ను కలెక్టర్ రాజర్షి షా గారు అందుకున్నారని తెలిపారు. ఆయన ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నానుడిని ఉదహరిస్తూ, నేటి పిల్లలు రేపటి పౌరులు కాబట్టి వారి ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి రోజు ఉదయం ప్రార్థన సమయంలో 20 నిమిషాల పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ



కార్యక్రమం ద్వారా సోమవారం నుండి శనివారం వరకు ప్రతి రోజూ ప్రత్యేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. వీటిలో వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార దినం, మానసిక ఆరోగ్య శ్రేయస్సు, మాదకద్రవ్యాల నివారణ, కాలానుగుణ వ్యాధులు, వ్యక్తిత్వ వికాసం వంటి విషయాలు ఉంటాయి.ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ ఎం.డి. ఇక్రమోద్దీన్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నైతం దేవుబాయి, మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్, ఉపాధ్యాయులు జ్యోతి, జయశ్రీ, అనసూయ, లక్ష్మణ్, దూస గంగన్న, పెంటపర్తి ఊశన్న, మూనహిద్, మోహిజే, పోచ్చిరాం, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఈ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా జిల్లాలో ఆరోగ్యవంతమైన, చైతన్యవంతమైన తరగతిని తయారు చేయడం లక్ష్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్ల బాలిరెడ్డి, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం స్థానంలో బట్ట సంచులు వినియోగించాలని పిలుపునిచ్చారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గజ్జల రాజు, నాయకులు గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం హెడ్మాస్టర్ షైమా నజ్ మజ్లిస్ యువజన నాయకులు మాట్లాడుతూ మజ్లిస్ తరపున విద్యను ప్రోత్సహించడానికి మా ప్రయత్నాలు ఎల్లప్పుడూ కొనసాగుతాయని అన్నారు. చిన్నారులకు విద్యా పట్ల ఆసక్తి కలిగేలా చేయడమే మా లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సభ్యులు సమీర్, ఇమ్రాన్, సయ్యద్ ఇంతియాజ్, సయ్యద్, అయూబ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో రోడ్లు,మురికి కాలువలు లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు.- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ లోని మెజారిటీ వార్డులలో గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా రోడ్లు, మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు.ఇదిలా ఉంటే మున్సిపల్ లో వీలినమైన వార్డుల పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు.ప్రత్యేక తెలంగాణ వస్తే అభివృద్ధి జరుగుతుందని ఆశించిన,ఏ మాత్రం జరగలేదని ఆరోపించారు.ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని టైలర్స్ కాలనీ రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు.రోడ్లు గుంతలుగా మారడంతో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నామన్నారు.సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రోడ్లు,వార్డుల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.వీరితో పాటు బిజెపి నాయకులు లాలా మున్నా,ఆకుల ప్రవీణ్,కృష్ణ యాదవ్,శరత్,సూర్య,కిరణ్,శివ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహన

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

గిరిజన మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం పీఎం ధర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ మరియు జన భగీధరి అభియాన్ పథకం క్రింద రాజన్న సిరిసిల్ల జిల్లా లో వీర్నపల్లి మండలం గర్జనపల్లి (సీతారం నాయక్ తండా) గ్రామములో గురువారం గిరిజనుల వికాసానికి సామాజిక ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకం, వివిధ పథకాల గురించి అన్ని విభాగాల ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదార్ కార్డ్, వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్, రేషన్ కార్డ్ మొదలగునవి అర్హులైన వారి నుండి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తాసిల్దార్ పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, వైద్యాధికారి లక్ష్మప్రసన్న, ఎంఈఓ టి. శ్రీనివాస్, ఎంఏఓ కె. జయ, డి ఆర్ డి ఏ నర్సయ్య, ఏఎంసి చైర్మన్ రాములు నాయక్, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సంతోష్ కుమార్, ఈడియ సిబ్బంది శ్యాం కుమార్, ఫారెస్ట్ అధికారి డి. వేణు, సంతోష్, గిరిజన సంక్షేమ ప్రోగ్రాం ఆర్గనైజర్ శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యాక్సిన్‌లపై సిద్ధరామయ్య వ్యాఖ్యలు అసత్యం

## వ్యాక్సిన్లు లక్షలమంది ప్రాణాలను నిలబెట్టాయి

## బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా

**న్యూఢిల్లీ,జూలై3(సమయజ్యోతి):**

హసన్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న మరణాలకు కొవిడ్ టీకాల ప్రభావమే కారణం కావొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యక్తంచేసిన అనుమానాలను తాజాగా బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా తోసిపుచ్చారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. సిద్ధరామయ్య అనుమానాలను తోసిపుచ్చిన ఆమె.. సీఎం వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయన్నారు. 'భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిడ్-19 వ్యాక్సిన్‌లు అత్యవసర వినియోగ అధికార చట్టం కింద ఆమోదించడం జరిగింది. భద్రత, సమర్థత కోసం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగానే ఇది తయారైంది. ఈ వ్యాక్సిన్‌లపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దని కూడా సూచించారు. ఇవి లక్షల మంది ప్రాణాలను కాపాడాయి. ప్రజలపై దుష్పరిణామాలు సంభవించిన కేసులు చాలా అరుదుగా చోటుచేసుకున్నాయి. ఈ వ్యాక్సిన్లపై నిందలు వేయడం మానేసి దాని అభివృద్ధి వెనక ఉన్న సైన్స్‌ను గుర్తించడం చాలా ముఖ్యం అని ఆమె తెలిపారు. ఇదిలాఉండగా.. యువత ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్ప, కొవిడ్ వ్యాక్సిన్ కాదని బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టంచేసింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), దిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనాల్లో ఈ విషయం తేలిందని పేర్కొంది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది. అయితే గత నెలలో హసన్ జిల్లాలో గుండెపోటుతో 20 మందికి పైగా మరణించడం పై సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మరణాలకు కచ్చితమైన కారణాన్ని గుర్తించి పరిష్కారాలు కనుగొనేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది రోజుల్లో దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొవిడ్ వ్యాక్సిన్లను ప్రజలకు తొందరపాటుగా ఆమోదించడం, పంపిణీ చేయడం కూడా మరణాలకు కారణం కావొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ఇటీవల పలు అధ్యయనాలు ఈ వ్యాక్సిన్లతో గుండెపోటు పెరుగుదలకు కారణమవుతాయని వెల్లడించాయన్నారు. దీనిపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలని కమిటీని ఆదేశించినట్లు తెలిపారు.

# ఫార్ములా కేసులో ఏసిబి విచారణ

## హాజరైన అరవింద్ కుమార్

**హైదరాబాద్,జూలై3(సమయజ్యోతి):**

ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ గురువారం ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఏసీబీ విచారణకు వచ్చారు . ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా పని చేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదిలాయించినందుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఇప్పటికే రెండుసార్లు ఏసీబీ అధికారులు విచారించారు. జూన్ 16న కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తోంది. ఎఫ్‌ఈవో కంపెనీకి దాదాపు రూ.45 కోట్లు 71 లక్షల నగదును బదిలీ చేశారు. వాటికి సంబంధించే మూడోసారి అరవింద్ కుమార్‌ను విచారణకు పిలిచి ఏసీబీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. ప్రధానంగా క ఏబినేట్ అనుమతి లేకుండా నిధుల బదలాయింపుపై ప్రశ్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. రేస్ నుంచి ఫార్ములా-ఈ ఆపరేషన్స్ తప్పుకొన్న అనంతరమూ నిధులు ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందనే కోణంలో ఆరా తీసింది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నా ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకపోవడం.. మంత్రివర్గం ఆమోదం పొందకపోవడం.. తదుపరి మూడేళ్లపాటు రేస్‌ల నిర్వహణకు రూ.600 కోట్ల మేర చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడాన్ని అంతర్గత విచారణలో ప్రభుత్వం తప్పుపట్టింది. ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే రూ.54.88 కోట్ల మేర చెల్లించడాన్ని తీవ్ర నేరంగా పరిగణించింది. దీనిపై ప్రస్తుతం ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. అయితే పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా కొనసాగిన అర్వింద్‌కుమార్ ఇదివరకే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.

# ఆలయాల్లో విగ్రహాలు, ఆభరణాల చోరీ

## వరుస దొంగతనాలపై పోలీసుల నజర్-వలపన్ని ఇద్దరిని పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,జూలై3(సమయజ్యోతి):**

ఆలయాల్లో విగ్రహాలను, ఆభరణాలను చోరీ చేసే ముఠాను పట్టుకున్నారు. అక్కడ ఉన్న పంచలోహ విగ్రహాలు.. బంగారు ఆభరణాలువీరు చోరీ చేస్తారు. పోలీసులకు దొరక కుండా తప్పించుకుని వెళ్లిపోతారు. ఇలా చోరీ చేసిన విగ్రహాలను ముంబై, చెన్నై స్మగ్లర్లకు అమ్మేస్తున్నారు. వరుసగా చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేయడంతో నిందితులు పట్టుబడ్డారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో వరుసగా జరుగుతున్న చోరీల కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. దాదాపు ఫిబ్రవరి నుంచి నిన్న మొన్నటి వరకు ఆలయాల్లో జరుగుతున్న చోరీలు పోలీసులను కలవరపాటుకు గురిచేశాయి. ఎంతగా దర్యాప్తు చేస్తున్నా.. దొంగలు పట్టుబడలేదు. కానీ సాంకేతిక ఆధారాలు, ఇతర అంశాలను ఆధారం చేసుకుని చివరకు కేసును ఛేదించారు.. ఈ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,36,300 విలువైన పంచలోహ విగ్రహాలు, ఇతర బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వరుసగా దేవాలయాల్లో చోరీలు పాల్పడుతున్న నిందితులను ఆంధ్రకు చెందిన పాత నేరస్తులని అధికారులు తేల్చారు. ఈ దొంగలు ఇద్దరిని కే. శివానంద, షేక్ హమ్ షరీఫ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితులు కర్నూల్, ప్రకాశం జిల్లాలకు చెందిన వలస కార్మికులని చెబుతున్నారు. ఎలాగైనా డబ్బు సంపాదించాలని ఆలయాలపై చోరీలకు పాల్పడ్డట్లు తెలిపారు. శివానందపై గతంలో కాజీపేట్, మీర్‌పేట్, నాగోల్ పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. ఫిబ్రవరి 27 నుండి జూన్ 30 మధ్య కాలంలో యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఆరు ఆలయాల్లో చోరీలు చేశారని విచారణలో తేలింది. దొంగతనం చేసిన తర్వాత విగ్రహాలను ఉప్పల్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి శివకుమార్‌కు అమ్మేశారు.. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఆలయాల నుంచి దొంగిలించిన పంచలోహ విగ్రహాలను చెన్నై, ముంబైలోని స్మగ్లర్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. అటు నుంచి విదేశాలకు కూడా ఈ పంచలోహ విగ్రహాలు వెళ్తున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు?

# తాను ముందునుంచీ ప్రజల మనిషినే

## సమస్యల పరిష్కారం కోసం నాదగ్గరకు వస్తారు

**నాబిడ్డ రాజకీయం గురించి ఆమె అభీష్టానికే వదిలేశాం**

**పేదలు, బిసిల పక్షాన నిలబడి కొట్లాడుతున్నా**

**కాంగ్రెస్ పదికాలాలపాటు నిలబడాలన్నదే కోరిక**

**మీనాక్షి ముందుకు కొండా దంపతులు**

**హైదరాబాద్,జూలై3(సమయజ్యోతి):**

తాను వెనుకబడిన వర్గాల ప్రతినిధినని కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. నేను పేదల మనిషిని, అందుకే ప్రజలు సమస్యల కోసం నాదగ్గరకు వస్తారని అన్నారు. తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో జరుగుతున్న అంశాలపై ఆమెకు నివేదిక ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకరి గురించి నేను కామెంట్ చేయను. నాకు ప్రజాబలం ఉంది. చాలా కేసులకే నేను భయపడలేదు.. భయం లేదని ముందు నుంచీ చెబుతూనే ఉన్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాం కాబట్టే జనం నా దగ్గరికి వస్తారని అన్నారు.

నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు. పనిచేసే వారిపైనే కొందరు రాళ్లు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షి నటరాజన్‌తో చెప్పా. మా సేవల్ని పార్టీ ఉపయోగించుకోవాలని కాంగరెస్ ఇన్‌ఛార్జ్‌ను కోరా. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా లక్ష్యం. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేళ్లు ముఖ్యమంత్రిగా చూడాలి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అండగా నిలుస్తానని అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరగబోయే ఖర్గే సభపై చర్చించాం. వరంగల్ నుంచి ఎంత మంది వస్తారనే అంశంపై మాట్లాడాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తా. ఎమ్మెల్యేలను మళ్లీ వరంగల్‌లో గెలిపించడమే నా బాధ్యత. నేను ఎవరికీ భయపడేది లేదు. ఎలాంటి గ్రూపు రాజకీయాలతో నాకు సంబంధం లేదని కొండా మురళి తెలిపారు.తన కూతరు రాజకీయం గురించి తనకు తెలియదని, ఆమెకు సొంతంగా ఆలోచనలు ఉంటాయని, ఆమె ఆలోచనలను అడ్డుకునే హక్కు తనకు లేదన్నారు. ఇకపోతే తనకు



ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. నిబంధనల ప్రకారమే పని చేస్తున్నాను. నా శాఖలో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా ఇప్పటివరకు ఎలాంటి తప్పులు చేయలేదు. సుష్మితలో పారేది కొండా మురళి, కొండా సురేఖ రక్తం. ఆమెకు మా ఆలోచనలు వంశపారంపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం. భవిష్యత్తు ఎలా ప్లాన్ చేసుకోవాలో నిర్ణయించే అధికారం ఆమెకు ఉంది. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూస్తామని కొండా సురేఖ అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో వరంగల్‌లోని నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను ఇటీవల పీసీసీ క్రమశిక్షణ కమిటీ.. గాంధీ భవన్‌కు పిలిచి వివరణ అడిగింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోసం మళ్లీ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. కొండా మురళి.. సొంత పార్టీ నేతలని టార్గెట్ చేసి తీవ్ర విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలను పరోక్షంగా విమర్శించారు. దీంతో ఆయా నేతలు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ వివాదాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ, మురళీ కాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ తో భేటి అయ్యారు. తన వ్యాఖ్యలపై ఇంచార్జ్ కి వివరణ ఇచ్చారు. ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కి 16 పేజీల లేఖ సమర్పించారు.

# మాలిలో ముగ్గురు భారతీయులు కిడ్నాప్

**న్యూఢిల్లీ,జూలై3(సమయజ్యోతి):**

మాలిలో ముగ్గురు భారతీయులు కిడ్నాప్‌కు గురయ్యారు. ఈ విషయాన్ని భారత విదేశాంగశాఖ గురువారం ధ్రువీకరించింది. పశ్చిమ మాలిలోని కాయెస్ ప్రాంతంలోని డైమెండ్ సిమెంటు ఫ్యాక్టరీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 1న ఈ ప్రాంతంలో సాయుధ దుండగులు దాడి చేసి.. అక్కడి కార్మికులను బందీలుగా తీసుకెళ్లారు. వారిలో భారత్‌కు చెందిన ముగ్గురు కార్మికులు ఉన్నారు. అల్‌ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లాం వాల్ ముస్లిమిన్ ఈ దాడిని తామే చేశామని ప్రకటించింది. కిడ్నాప్‌కు గురయిన వారి వివరాలను విదేశాంగశాఖ వెల్లడించలేదు. మాలి రాజధాని బమాకోలోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులు, పరిశ్రమ యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతుందని విదేశాంగశాఖ తెలిపింది. ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. బందీలను సురక్షితంగా, త్వరగా విడుదల చేయడానికి మాలీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈసందర్భంగా మాలిలోని భారతీయ పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. సాయం కోసం మన రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

# ఉడా వివాదాస్పద భూముల్లో రైతుల నిరసన

**విశాఖపట్టణం,జూలై3(సమయజ్యోతి):**

వేపగుంటలో ఉన్న ఉడా వివాదాస్పద భూముల్లో స్థానిక రైతులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 50 సంవత్సరాలుగా ఈ భూమి సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. మా స్థలంలో మేము మొక్కలు వేస్తే.. ఉడా వారు వచ్చి మొక్కలను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో మా తాతలుకు వాళ్ళకు ఏదో అగ్రిమెంట్ జరిగిందని చెప్తున్నారని.. కానీ మాకు అయితే ఎటువంటి నష్టపరహారం రాలేదన్నారు. ఇక్కడ ఈ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న కానీ ఇక్కడ అభివృద్ధి జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కారం చూపాలని కోరారు.

# బాలి సమీపంలో సముద్రంలో ఫెర్రీ మునక

## 43 మంది గల్లంతయినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై3(సమయజ్యోతి):**

ఇండోనేసియాలోని బాలి సమీపంలో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మతి చెందగా.. 43 మంది గల్లంతయ్యారు. 20 మందిని సహాయక సిబ్బంది రక్షించారు. ప్రమాద సమయంలో అందులో 65 మంది ఉన్నట్లు గుర్తించారు. 22 వాహనాలు, 14 ట్రక్కులను అది మోసుకెళ్తున్నట్లు తెలిసింది. తూర్పు జావాలోని కెటాపాంగ్ పోర్టు నుంచి బయలుదేరిన అరగంటకే ఈ ప్రమాదం జరిగింది. 50 కిలోమీటర్ల దూరంలోని గిలిమనుక్ పోర్టుకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక సిబ్బంది గాలిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# టిటిడి అక్రమాలపై చంద్రబాబుకు లేఖ రాస్తా: లక్ష్మణ్

**తిరుమల,జూలై3(సమయజ్యోతి):**

గత జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమలలో చాలా అక్రమాలు జరిగాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఆరోపించారు. గతంలో ఉన్న టీటీడీ పాలకమండళ్లు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడాయని విమర్శించారు. గురువారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో వెంకటేశ్వర స్వామివారిని లక్ష్మణ్ దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి లడ్డూలో జరిగిన కల్తీ భక్తులను ఆందోళనకు గురిచేసిందని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తానని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# జనరటేర్ పొగతో ఊపిరాడక తండ్రీకుమారుల మృతి

**చెన్నై,జూలై3(సమయజ్యోతి):**

స్థానిక పుళల్ సమీపంలోని కదిర్‌వేడులో జనరేటర్ పొగ కారణంగా ఊపిరాడక ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. కదిర్‌వేడు బ్రిటానియా నగర్ 10వ వీధిలోని గంగా అవెన్యూ జంక్షన్ ప్రాంతంలో సెల్వరాజ్ (57) నివసిస్తున్నాడు. మాధవరంలో ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో పనిచేస్తున్న సెల్వరాజ్, రెండేళ్లుగా అద్దింట్లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య మాల , ఇదయ (16) అనే కుమార్తె, సుమన్‌రాజ్ (15), గోకుల్ రాజ్ (13) అనే ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం రాత్రిసెల్వరాజ్, ఆయన కుమారులు సుమన్‌రాజ్, గోకుల్‌రాజ్ ఒక గదిలోను, మాల, కుమార్తె ఇదయా మరొక గదిలో నిద్రపోయారు. బుధవారం ఉదయం చాలాసేపటివరకూ సెల్వరాజ్ గది నుండి ఎలాంటి అలికిడి వినకపోవడంతో ఆయన భార్య చుట్టుపక్కల వారి సాయంతో గది తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్ళింది. ఆ గదిలో సెల్వరాజ్, ఆయన కుమారులు నోటిలో నురగలు కారుతూ శవాలుగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే పుళల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే జనరేటర్ పొగ కారణంగా ఊపిరాడక వారు మృతి చెందారని గుర్తించారు.

# నైజీరియిన్‌ను పట్టుకుని మత్తు పదార్థాల స్వాధీనం

**హైదరాబాద్,జూలై3(సమయజ్యోతి):**

మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా ఆసిఫ్‌నగర్ లో భారీగా మత్తు పదార్థాలు బయటపడ్డాయి. సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నైజీరియన్‌ను వెంబడించి పట్టుకుని అరెస్ట్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి పోలీసులు వెంబండించారు. ఆసిఫ్ నగర్ లోనీ ఓ అపార్ట్‌మెంట్ లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎస్‌ఓటీ పోలీసులు ఆసిఫ్ నగర్ లోని ఓ ఫ్లాట్ లో సోదాలు నిర్వహించిన పోలీసులు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దొరికిన మత్తు పదార్థాలను టెస్టింగ్ కు తరలించారు. మారేడుపల్లి, ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఇద్దరిపై పలు కేసులు నమోదయ్యాయి. కేటుగాళ్లు కోర్టుకు హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు మరింత సులువు

## ముందస్తు చెల్లింపు జరిమానాలకు

## ఆర్‌బిఐ బ్రేక్

**ముంబై,జులై 3(సమయజ్యోతి):**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు అందుబాటులో ఉండేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జనవరి 1, 2026 నుంచి కొత్తగా ఇచ్చే లేదా పునరుద్ధరించే ఫ్లోటింగ్ రేట్ రుణాలపై బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకూడదని ఆర్‌బీఐ తెలిపింది. ఈ నిర్ణయం ఎంఎస్ఇలకు ఆర్థిక సౌలభ్యాన్ని, స్వేచ్ఛను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో అండ్ స్మాల్ / మీడియం ఎంటర్‌ప్రైజెస్ స్వాగతించింది. ఈ విధానం గతంలో రిటైల్ రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలను నిషేధించిన ఆర్‌బీఐ ఆదేశానికి అనుగుణంగా ఉంది. రుణ గ్రహీతల హక్కులను కాపాడడం, రుణ మార్కెట్‌లో ఆర్థిక చేరికను ప్రోత్సహించడం పట్ల ఆర్‌బీఐ తన నిబద్ధతను మరోసారి గుర్తు చేసింది. ఈ నిర్ణయం ఓ÷ూఇలకు మరింత సౌలభ్యం, ఆర్థిక స్వేచ్ఛను అందిస్తుందని, దీనివల్ల వ్యాపారులు తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మెరుగైన రుణ ఆప్షన్లను ఎంచుకుంటారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో సూక్ష్మ, చిన్న వ్యాపారాలకు సౌకర్యవంతమైన రుణ సౌలభ్యం చాలా ముఖ్యమని పేర్కొంది. బ్యాంకులు, ఔఃఈఅలు అనుసరిస్తున్న పద్ధతులను తమ పర్యవేక్షణ సమీక్షల్లో గుర్తించినట్లు తెలిపింది. ప్రధానంగా ముందస్తు చెల్లింపు జరిమానాలు రుణగ్రహీతలకు అసౌకర్యాన్ని కలిగించడమే కాక, ఒప్పంద వివాదాలకు కూడా దారితీస్తున్నాయని వెల్లడించింది. కొన్ని బ్యాంకులు, ఔఃఈఅలు రుణ ఒప్పందాల్లో పరిమితి కలిగించే నిబంధనలు చేర్చి, రుణ గ్రహీతలకు తక్కువ వడ్డీ రేట్లు లేదా మెరుగైన సేవల కోసం ఇతర రుణదాతల వైపు మళ్లకుండా అడ్డుకుంటున్నాయని ఆర్‌బీఐ బుధవారం రాత్రి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ఇలాంటి పద్ధతులు రుణ గ్రహీతల ఎంపిక స్వేచ్ఛను, మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. ఈ ఆంక్షల నుంచి కొన్ని రకాల రుణదాతలకు మినహాయింపు ఇచ్చారు. స్మాల్ ÷నాన్స్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, టైర్3 ప్రైమరీ (అర్బన్) కో ఆపరేటివ్ బ్యాంకులు, రాష్ట్ర, కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంకులు, మిడిల్ లేయర్ ఔఃఈఅలు ఉన్నాయి. దీంతోపాటు ఇప్పటికే రూ.50 లక్షల వరకు రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకుండా నిషేధించబడ్డాయి. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాల విషయంలో రుణ గ్రహీత ఒప్పందంలో నిర్దేశిరచిన వ్యవధిలో సౌకర్యాన్ని పునరుద్ధరించ కూడదని బ్యాంకుకు ముందస్తు సమాచారం ఇస్తే, సౌకర్యం గడువు తేదీన రద్దు అయితే, ముందస్తు చెల్లింపు జరిమానాలు వర్తించవని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

# గ్రూప్‌వన్‌లో అవకతవకలపై పిటిషన్లు

## ఎలాంటి అవకతవకలు లేవన్న టీజీపీఎస్సీ

## వాదనలు విని విచారాణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తెలుగు మీడియం అభ్యర్థులకు సరైన మార్కులు వేయలేదని పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు. వారు చేస్తోన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమేనని వాదించారు. గ్రూప్ 1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎవాల్యుయేటర్‌కు ఏమైనా మార్గదర్శకాలున్నాయా అని ప్రశ్నించింది. టీజీపీఎస్సీ నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను ఉన్నత న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

# హైదరాబాద్ చేరుకున్న ఏఐసీసీ చీఫ్

## ఎయిర్‌పోర్టులో ఖర్గేకు స్వాగతం పలికిన

## రేవంత్ తదితరులు

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఆయనకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌కు ఖర్గే చేరుకున్నారు. అయితే మంత్రి పదవి ఆశించి భంగపడ్డ పలువురు ఎమ్మెల్యేలతో ఖర్గే భేటీ కానున్నారు. అందుకోసం వారికి ఖర్గే అపాయింట్‌మెంట్ ఇచ్చారు. కాగా, ఆది శ్రీనివాస్, బాలు నాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఇప్పటికే తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకున్నారు. అలాగే తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య సైతం ఖర్గేతో భేటీ కానున్నారు. శుక్రవారం నగరంలోని ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తలతో భారీ సభ జరగనుంది. ఈ సభకు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆ సందర్భంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్యాడర్‌కు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా కేడర్‌ను ఈ సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు శుక్రవారం జరగనున్న ఈ సభకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.



# 5న బిజెపి అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం నాడు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి.. ఉదయం 10 గంటలకు బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం చార్మినార్ దగ్గర ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారని కమలం పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.బీజేపీ హైకమాండ్ ఆదేశాల మేరకే రామచంద్రరావును పార్టీ చీఫ్ గా ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కానీ, రామచంద్రరావు ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేసిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ నామినేషన్ వేయడానికి ప్రయత్నించినప్పటికీ కౌన్సిల్ సభ్యుల బలం లేకపోవడంతో ఆయన నామినేషన్ తీసుకోలేదు. దీంతో అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీకి రాజీనామా చేశారు. అలాగే, అధ్యక్ష రేసులో ఉన్న ఎంపీ ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్‌లు కమలం పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు రామచంద్రారావుకు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కిషన్ రెడ్డి స్థానంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎన్నికయ్యారు. ఆయన శనివారం నాడు పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.



# అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం

## దుండగుల కాల్పుల్లో నలుగురు హతం

**న్యూయార్క్,జులై 3(సమయజ్యోతి):**

అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం రేగింది. బుధవారం చికాగోలోని రివర్ నార్త్ ప్రాంతంలోగల ఆర్టిస్ లాంజ్ అనే నైట్ క్లబ్ వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా సుమారు 14 మంది గాయపడ్డారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో వాహనంలో క్లబ్ ముందు నుంచి వెళ్లిన కొందరు అక్కడున్న జనాలపై కాల్పులు జరిపి పారిపోయారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్లు చికాగో పోలీసులు ధ్రువీకరించారు. సుమారు 25 ఏళ్ల వయసున్న ఇద్దరు యువకులు, మరో ఇద్దరు యువతులు మృతిచెందినట్లు తెలిపారు. గాయపడ్డ వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని అన్నారు. అనుమానితుల సమాచారం తెలిసిన వారు వెంటనే తమను సంప్రదించాలని కూడా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక కాల్పులకు కారణమేంటో కూడా ఇంకా తెలియరాలేదు. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు ఘటనాస్థలం సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనాల ఆధారంగా ఘటన మూలాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక నైట్‌లైఫ్‌కు ప్రసిద్ధి గాంచిన రివర్ నార్త్ ప్రాంతంలో తాజా కాల్పుల ఘటన కలకలానికి దారి తీసింది. నగరంలో పెరుగుతున్న గన్ కల్చర్‌పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చిత్రాల పైరసీతో భారీ బిజినెస్

## కేటుగాడిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

టాలీవుడ్‌లో విడుదలైన పలు భారీ చిత్రాలను పైరసీ చేసి.. వాటి ద్వారా భారీగా నగదు దండుకుంటున్న కిరణ్ కుమార్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి భారీగా పైరసీ సినిమా ÷ల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కిరణ్ కుమార్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో దాదాపు 40 పెద్ద సినిమాలను అతడు పైరసీ చేసినట్లు గుర్తించారు. ఈ సినిమాలను హెచ్‌డీ ప్రింట్ రూపంలో పైరసీ చేసి విక్రయించినట్లు కనుగొన్నారు.ఈ భారీ చిత్రాలను పైరసీ చేయడం వల్ల టాలీవుడ్ పరిశ్రమకు రూ. 3,700 కోట్లు నష్టం వాటిల్లిందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. మరోవైపు కామ్ కార్డ్ ద్వారా సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసుల ఎదుట కిరణ్ కుమార్ ఒప్పుకున్నాడు. సినిమా థియేటర్లలోనే పైరసీ చేసి వాటిని అతడు మాఫియాకి విక్రయించేవాడు. వన్ తమిళ్ ఎమ్‌వీ సంస్థకు ఈ పైరసీ సినిమాలను అతడు విక్రయించాడు. ఇలా ఒక్కొక్క సినిమాకి అతడు 400 క్రిప÷-టో కరెన్సీని తీసుకున్నాడు. స్ప్రింటోతోపాటు బిట్ కాయిన్స్ రూపంలో వారి నుంచి కిరణ్ కుమార్ నగదు వసూల్ చేశారు. బిట్ కాయన్స్, క్రిప్టో రూపంలో వచ్చిన నగదును గూగుల్ పే ద్వారా ఇండియన్ కరెన్సీకి అతడు మార్చుకున్నట్లు విచారణలో సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఇటీవల విడుదలైన కన్నప్ప, పెళ్లికాని ప్రసాద్, గేమ్ చేంజర్, రాజధాని సినిమాలకు చెందిన ÷ల్స్‌ను కిరణ్ కుమార్ నుంచి సైబర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ల÷దరాబాద్ థియేటర్లలోనే కామ్ కార్డు ద్వారా కిరణ్ ఈ సినిమాలు రికార్డింగ్ చేసినట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఏడాదిన్నర కాలంలో దాదాపు 40 పెద్దపెద్ద సినిమాలను పైరసీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. వాటిల్లో తెలుగు, తమిళ సినిమాలు ఉన్నాయి. ఇప్పటివరకూ 65 సినిమాలను రికార్డు చేసినట్లు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. వన్ తమిళ్‌బ్లాస్టర్, వన్ తమిళ్‌ఎమ్‌వీ, 5 మూవీరూల్జ్, వెబ్ సైట్లకు ఈ పైరసీ సినిమాలను విక్రయించినట్లు తెలుస్తోంది.తండేల్, సింగిల్, కిస్మత్ (హిందీ), రోమాంటిక్, గేమ్ ఆన్, పెళ్లి కానీ ప్రసాద్, రాజధాన్ని÷ల్స్, ప్రతిరోజు పండుగే చిత్రాలు అతడు పైరసీ చేసిన జాబితాలో ఉన్నాయి. సినిమా హాళ్లకు వెళ్లి అనువైన చోట టిక్కెట్ బుకింగ్ చేసుకుని పైరసీకి ప్లాన్ చేసాడని గుర్తించారు.

# పైరసీపై కఠిన చర్యలు

## ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

## సినిమా ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి కృషి

## ఎఫ్.డి.సి చైర్మన్ దిల్ రాజు

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టెందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. గురువారం ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంకతో కలిసి సమాచార శాఖ ఎఫ్‌డీసీ బోర్డు రూమ్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహించామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని అయన వెల్లడించారు. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆ÷-లనైన్ అనుమతుల ప్రొసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు



తీసుకుంటామని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# అంగన్‌వాడీ హెల్పర్లకు శుభవార్త

## టీచర్ ప్రమోషన్ల గిర్‌ష్ట వయోపరిమితి పెంపు

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అంగన్వాడి టీచర్లుగా ప్రమోషన్ పొందే హెల్పర్ల గరిష్ట వయోపరిమితిని పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం వల్ల 45 ఏళ్లు దాటిన హెల్పర్లకు ప్రయోజనం చేకూరనుంది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లు ఉన్నారు. వీరందరికీ అంగన్వాడీ టీచర్లుగా ప్రమోషన్ దక్కే అవకాశం ఉంది. టీచర్లుగా ప్రమోషన్ పొందాలి అనుకునే అంగన్వాడి హెల్పర్ల గరిష్ట వయసును 50 ఏళ్లకు పెంచే ఫైలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి సీతక్కకు అంగన్వాడి యూనియన్ లు ధన్యవాదాలు తెలిపారు.

# విపిఓ విధానాన్ని పటిష్టంగా అమలు చేసి గ్రామాల నుండి సమాచారాన్ని సేకరించాలి: - ఎస్ పి అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ జూలై 03 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ ను ఎస్ పి అఖిల్ మహాజన్ సందర్శించి సిబ్బంది కి పలు సూచనలు చేశారు రానున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరు పూర్తిగా సంసిద్ధమై ఉండాలి. వర్టికల్స్ను క్రమం తప్పకుండా ఎటువంటి పెండెన్సీ లేకుండా నిర్వహించాలి.మండలంలో గంజాయి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అసంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలి.పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వివరించాలి.మండల పరిధిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలి.




సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. మొదటగా పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశీలించి పరిశుభ్రంగా ఉందని ప్రశంసించారు. పోలీస్ స్టేషన్ నందు రికార్డులను సక్రమంగా నిర్వర్తిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ల కేటాయించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థాయిలో ఎలాంటి సమాచారమైన సేకరించే విధంగా ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా పోలీస్ సిబ్బందిని కేటాయించి, సంబంధిత రిపోర్టులను స్టేషన్ హౌస్ ఆఫీసర్ కి అందించేలా చూడాలన్నారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మాదకద్రవ్యాలను గంజాయి లాంటి వాటిని మండల పరిధిలో లభించకుండా కఠిన చర్యలతో అరికట్టాలని సూచించారు. వర్టికల్ లను పూర్తిస్థాయిలో వినియోగించుకొని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాలను సందర్శించి సీసీటీవీ కెమెరాల యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయాలలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తూ ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. విలేజ్ హిస్టరీ షీట్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని సూచించారు. పోలీసు యూనిఫామ్ అనేది ప్రజలలో గౌరవంగా వ్యవహరిస్తుందని, దాని మర్యాదకు భంగం కలగకుండా చక్కటి యూనిఫామ్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ ఎస్ఐ ఎల్ ప్రవీణ్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శుభవర్షాల కోసం మైనాపురం పెళ్లి మెక్సికన్ మేయర్ మొసలితో వివాహ బంధం

**సాన్ పెడ్రో హువామెలులా, మెక్సికో ఎ జూలై 1, 2025:**

పురాతన ఆదివాసీ సంప్రదాయాల్ని ఆధునిక ఉత్సాహంతో మేళవిస్తూ, మెక్సికోలోని ఓ చిన్న పట్టణం మేయర్ ఓ మొసలి వధువుతో వివాహం చేసుకున్నాడు. ఈ రంగుల సంబరానికి ఉద్దేశ్యం ఎ వర్షాలు, పంటల సమృద్ధి మరియు ప్రజల సంక్షేమం సాధించడమే.ఈ ఆచారం ఒక్సాకా రాష్ట్రంలోని సాన్ పెడ్రో హువామెలులా అనే తీరప్రాంత పట్టణంలో జరిగింది. పట్టణ మేయర్ విక్టర్ హ్యూగో సోసా, "లిటిల్ ప్రిన్సెస్" అనే పేరుతో పిలిచే ఆడ మొసలిని వివాహమాడారు. ఇది చొంటల్ మరియు హువావే ఆదివాసీ గిరిజన తెగల వద్ద శతాబ్దాలుగా వస్తున్న ప్రాచీన సంప్రదాయం. పెళ్లికూతురు సాంప్రదాయబద్ధమైన తెల్ల దుస్తులు, వెయిల్, నగలతో అలంకరించబడింది. ఆమెను పట్టణ వీధులలో పర్యటింపజేస్తూ, సంగీతం, నృత్యాలతో స్థానికులు సందడి చేశారు. పిల్లలు, పెద్దలు అంతా ఆనందంగా ఈ ఉత్సవాన్ని జరిపారు. మేయర్ మొసలికి ముద్దిచ్చి, మనుషులు మరియు ప్రకృతి మధ్య ఐక్యతను సూచించే చిహ్నంగా ఈ కార్యక్రమం కొనసాగింది.ఈ ఆచారం కేవలం సాంప్రదాయానికే పరిమితమైంది కాదు ఎ ఇది భూమి మరియు నీటి దేవతలను గౌరవించే పవిత్ర చర్యగా





భావిస్తారు. మొసలి దేవతను ప్రతినిధిగా చూస్తారు, మరియు ఆమెను మానవ నాయకుడితో తాత్కాలికంగా పెళ్లి చేసి, సమాజం మరియు ప్రకృతి మధ్య సమతుల్యతను స్థాపించడమే ఉద్దేశ్యం."ప్రకృతి ఆశీర్వాదాల కోసం మనం ప్రార్థిస్తున్నాం. ఈ వివాహం? స్వాతంత్ర్యానికి సంకేతం కాదు ఎ ఇది మన సంస్కృతిలో భాగం," అని మేయర్ సోసా తెలిపారు.పెళ్లి కార్యక్రమానికి ముందు, మొసలిని పెద్దలు ఆశీర్వదిస్తారు, మరియు భద్రత నిమిత్తం మోము కట్టినట్లుగా కట్టుతారు. అనంతరం, ఈ "వధువు"ను స్థానిక జలాశయంలో విడిచిపెడతారు, తద్వారా సంప్రదాయం కొనసాగుతుంది.ఈ వార్షిక ఉత్సవం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది ఎ ఇది మెక్సికో ప్రాచీన సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తోంది.ఔట్సైడర్లకు ఇది విచిత్రంగా అనిపించినా, సాన్ పెడ్రో హువామెలులా ప్రజలకు ఇది ఐక్యత, ప్రకృతితో మానవ సంబంధం మరియు ఆశలకు సంకేతంగా ఉంటుంది.

# యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గం వైపు పయనించాలి.- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

యువత చెడు వ్యసనాల బారిన పడకుండా, సన్మార్గం వైపు పయనించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.గురువారం రోజు బోథ్ మండలం కౌట(బి) గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని యువతకు,విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు.మొదటగా జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికిన విద్యార్థులు, ఆదిలాబాద్ జిల్లా నందు ప్రస్తుతం జరుగుతున్న స్థితిగతులపై మరియు బోథ్ మండలంలో ఉన్న యువత ప్రజలు మొబైల్ ఫోన్ వాడకం వినియోగం ఎక్కువగా జరుగుతున్న వాటిపై జిల్లా ఎస్పీకి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు.గ్రామంలోని ఎందరో మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని వారిని స్ఫూర్తిగా తీసుకొని తాము ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు.యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించి,వాటి బారిన పడితే కలిగే అనర్థాలను వివరించారు.ముఖ్యంగా విద్యార్థినిలకు అండగా ఆదిలాబాద్ జిల్లా షీ టీం బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఎలాంటి సహాయ సహకారమైన 871265953 నెంబర్ కి సంప్రదించాలని,సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.అదేవిధంగా జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై గంజాయి మరియు మాదకద్రవ్యాలపై ప్రత్యేక కార్యచరణ రూపొందించి అవలంబించడం జరుగుతుందని,అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు మెసేజ్ యువర్ ఎస్పీ అనే కార్యక్రమం ద్వారా ప్రారంభించబడిన 8712659973 నెంబర్ కి సమాచారం అందించవచ్చని తెలిపారు.యాంటి డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు,చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరిగిందని గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా విద్యార్థులచే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేయించి వారిని యాంటీ డ్రగ్ సోల్జర్ గా పని చేయాలని తెలిపారు.గంజాయి పండించినా,వ్యాపారం చేసినా,సేవించినా చట్ట ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని,ప్రభుత్వం ద్వారా వచ్చే ఎలాంటి లబ్ధి వారికి చేకూరదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,ఎస్సై ప్రవీణ్ కుమార్,గ్రామ పెద్దలు,యువత,చిన్నారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతతకు ఆధ్యాత్మికత అలవాటు చేసుకోవాలి -ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**సమయజ్యోతిన్యూస్ రామచంద్రాపురం**

జీవితంలో ప్రశాంతత ఆధ్యాత్మికత వల్లనే సాధ్యమని కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజక వర్గ ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు గురువారం రామచంద్రాపురం ఎల్ఐజీ కాలనీ విద్యాభారతి పాఠశాల ప్రాంగణం లో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యం లో జరిగిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం లో ఆయన స్థానిక కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా రథ యాత్రను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమం లో విద్యాభారతి పాఠశాల చైర్మన్ దామోదర్ రెడ్డి సొసైటీల ప్రతినిధులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు జిల్లా ప్రధానకార్యదర్శి రాజశేఖర్ రెడ్డి నందరెడ్డి లక్ష్మణ్ ఇతర నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్

## చికిత్స కోసం యశోదాలో చేరిక

**హైదరాబాద్,జులై 3(సమయజ్యోతి):**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కెసిఆర్ సీజనల్ జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి నగరంలో నందినగర్లోని తన నివాసానికి కేసీఆర్తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఒపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయనకు జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. కెసిఆర్ వెంట భార్య శోభారాణి, కెటిఆర్,హరీష్ రావు, మాజీ ఎంపి సంతోష్ కుమార్ ఉన్నారు.

# ప్రారంభమైన అమర్నాథ్ యాత్ర

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**శ్రీనగర్,జూలై3(సమయజ్యోతి):**

కశ్మీర్ హిమాలయ పర్వతాల్లో మంచులింగం రూపంలో కొలువైన శివుడ్ని భక్తులు దర్శించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్నాథ్ యాత్ర ప్రారంభమైంది. యాత్ర మారాల్లో గగనతలంపై నుంచి కూడా పర్యవేక్షణ సాగుతోంది. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 9 నాటికి పూర్తవుతుంది.3880 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో ఉన్న ఈ క్షేత్రానికి గురువారం మొదటి బ్యాచ్ భక్తులు బల్తాల్, నున్వాన్ శిబిరాల నుంచి బయలుదేరారు.అనంతనాగ్ లోని పహల్గాం లో నున్వాల్ శిబిరం నుంచి 48 కిమీ రూటు నుంచి, సెంట్రల్ కశ్మీర్ లోని గండెర్బాల్ సోనామార్గ్ ఏరియా14 కిమీ బల్తాల్ రూటు నుంచి గురువారం తెల్లవారు జామున బయలుదేరారు. యాత్రికులు 'భంభం బోలే.. హరహరమహాదేవ్' నినాదాలతో ముందుకు సాగారు. ముందుగా భరించలేని వాతావరణంలో కష్టతరమైన మార్గం ఉన్నా వారి ముఖాల్లో ఆనందం తొంగి చూసింది. యాత్రికులు తమకు కట్టుదిట్టమైన భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. యాత్రికులతోపాటు కేంద్ర మంత్రి శోభ కరండ్లజే కూడా బల్తాల్ రూటులో బయలుదేరారు. బుధవారం జమ్ము లోని భగవతి నగర్ శిబిరం నుంచి మొదటి బ్యాచ్ 5892 మంది యాత్రికులు బయలుదేరారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్రికులు మధ్యాహ్నం కశ్మీర్ లోయకు చేరుకోగానే అధికారవర్గాలు, స్థానికులనుంచి వారికి ఘనమైన స్వాగతం లభించింది. గత ఏప్రిల్లో పహల్గాం ఉగ్రదాడిలో 22 మంది తుపాకీ కాల్పులకు బలైపోయిన దుర్ఘటన దృష్ట్యా భక్తులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఉండేందుకు గట్టిభద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీస్, పారామిలిటరీ విభాగాల నుంచి వేలాది మంది భద్రత సిబ్బందిని నియమించారు.

# బెడిసికొట్టిన పసికందు అమ్మకం వ్యవహారం

## డబ్బుల దగ్గర తేడా రావడంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు

**నిజామాబాద్,జూలై3(సమయజ్యోతి):**

నవ మాసాలు మోసి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి ఆ పసి కందును అమ్మకానికి పెట్టింది. పురిటి నొప్పుల బాధ తగ్గక ముందే ఆ పసి కందును తన పొత్తిళ్లు దూరం చేసింది. కానీ బేరం బెడిసి కొట్టడంతో కన్న తల్లి ఎదురు తిరిగింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సాక్షిగా సాగిన పసికందు అమ్మకం గుట్టును రట్టు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కొద్ది గంటల వ్యవధిలో కథకు సుఖాంతం ఇచ్చారు. మొత్తం ఈ వ్యవహారంలో ప్రియుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిజామాబాద్ నగరంలోని నాగారం మూడువందల క్వార్టర్స్లో ఉండే ఓ మహిళ డెలివరీ కోసం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరింది. మూడు రోజుల క్రితం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లడానికి కొద్ది గంటల ముందే నవ మాసాలు మోసిన తల్లి ప్రియుడి ఒత్తిడితో కర్కషంగా మారింది. ఆ పసికందును అమ్మడానికి సిద్ధమైంది. ఓ ముఠాతో రెండు లక్షల రూపాయలకు విక్రయించడానికి ఒప్పందం చేసుకుంది. ఆమె ప్రియుడు నజీర్ మధ్యవర్తిత్వతం వహించాడు. పూలాంగ్కు చెందిన భార్యభర్తలు పసికందును కొనుగోలు చేశారు. అయితే రెండు లక్షలు ఇస్తామని నమ్మబలికిన ముఠా లక్ష రూపాయలు ఇచ్చి చేతులేత్తేసింది. దీంతో ఆ తల్లి ఎదురు తిరిగి జనరల్ ఆస్పత్రిలో సాగిన పసికందు అమ్మకం గుట్టును రట్టు చేసింది. నేరుగా సమీపంలోని ఒకటవ టౌన్ పోలీసు స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేసింది. జరిగిన తతంగాన్ని చెప్పి తన బిడ్డను తిరిగి ఇప్పించాల్సిందిగా కన్నీరుమున్నీరుగా విలపించింది. దీంతో హుటాహుటిన దిగిన పోలీసులు హైమదీబజార్కు చెందిన ముఠాతో పాటు పసికందును కొనుగోలు చేసిన వారిని సైతం అదుపులోకి తీసుకుంది. కొద్ది గంటలోపే కన్న తల్లి ఒడికి చేర్చారు.

# నైరుతి ముఖం చాటేయడంతో ఆందోళన

## రాయలసీమలో వేరుశనగాకు కష్టకాలం

**విజయవాడ,జూలై3(సమయజ్యోతి):** మరోమారు ఖరీఫ్‌పై నైరుతి తీవ్ర ప్రభావం చూపింది. పలు జిల్లాల్లో ఇప్పటికీ చినుకు జాడ లేదు. దీంతో పంటలు ఆలస్యం కవాడంతో పాటు, పలు జిల్లాల్లో వేసిన విత్తనాలు వట్టిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఎప్పటి కంటే కాస్తంత ముందుగా మే 26, 27 తేదీల్లో రాష్ట్రాన్ని పలకరించాయి. దీంతో వానలు పడతాయని, ఖరీఫ్ పంటల సాగుపై రైతుల్లో ఆశలు చిగురించాయి. అంతలోనే రుతుపవనాలు సుదీర్ఘకాలం ముఖంచాటేయడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తిరిగి వారం రోజులుగా రుతుపవనాల్లో కదలిక రావడంతోపాటు అల్పపీడనం, ఉపరితల ఆవర్తనాల వలన కొద్దిపాటి వానలు కురుస్తున్నాయి. కాగా రుతుపవనాల ఆగమనంతో సీజన్ మొదటి నెల జూన్లో సాధారణ వర్షం పడటం మామూలే. కానీ వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరగడంతో పంటలు వేసుకునే వారికి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. దీంతో ఎపిలో8 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. తెలంగాణలోనూ ఉత్తర, దక్షిణ జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. రాయలసీమలో వేరుశనగ రైతులు వానల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అరకొరగా సబ్సిడీపై అందిస్తున్న విత్తనాల పంపిణీ మందకొడిగా సాగుతోంది. ఇతర మెట్ట పంటల సేద్యం సైతం నెమ్మదిగానే కొనసాగుతోంది. ఈ మారు ఖరీఫ్ ప్రారంభంలోనే రాష్ట్రాన్ని వర్షాభావం వెంటాడుతోంది. జూన్ మాసంలో ఎనిమిది జిల్లాల్లో సాధారణస్థాయి కంటే తక్కువ వర్షం నమోదైంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, దక్షిణాంధ్రలో పల్నాడు, నెల్లూరు, రాయలసీమలో అనంతపురం, కర్నూలు, నంద్యాల మినహా తతిమ్మా జిల్లాల్లో వర్షాభావం నెలకొంది. ఆదిలోనే వర్షాభావం ఎదురుకావడంతో ఆయా ప్రాంతాల్లో పంటల సేద్యం దాదాపుగానిలిచిపోయింది. అల్లూరి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల సగటు లెక్కల ప్రకారం వర్షాభావానికి దగ్గరగా ఉన్నాయి. రాష్ట్రంలో సగటున సాధారణ వర్షం కురిసినట్లు కనిపిస్తోంది. మొత్తం 26 జిల్లాలుండగా ఎనిమిది జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 54.69 శాతం తక్కువ వర్షం పడింది. సాధారణం కంటే ఎక్కువ వర్షం తొమ్మిది జిల్లాల్లో కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో 70.72 శాతం ఎక్కువ వర్షం నమోదైంది. మిగతా తొమ్మిది జిల్లాల్లో సాధారణ స్థాయిలో వానలు పడ్డాయి. ఈ ఏడాది అనంతపురంలో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడింది. జూన్‌లో లో ఆ జిల్లాలో మామూలుగా 41.85 మిమీ వర్షం పడాల్సి ఉండగా 54.73 మిమీ పడింది.

# వృధా గోదావరి జలాల వినియోగమే లక్ష్యం

**తెలంగాణలో ప్రాజెక్టులను ఎన్నడూ వ్యతిరేకించలేదు**

**దేవాదులతో ఎత్తిపోతలకు నేనే శ్రీకారం చుట్టా**

**200 టిఎంసిల వృధా జలాలో బనకచర్లకు ప్లాన్**

**వృధా జలాలను వాడుకుంటే తెలుగు రాష్ట్రాలకు మేలు**

**జగన్ కుత్సిత రాజకీయాలతో కలుషితం చేస్తున్నారు**

**సింగయ్య మృతిలో కనీస మానవత్వం ప్రకటించని నేత**

**మామిడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం**

**ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల విధానం**

**కుప్పంలో మీడియా సమావేశంలో చంద్రబాబు**

**కుప్పం,జూలై3(సమయజ్యోతి):** తెలంగాణలో గోదావరి ప్రాజెక్టులకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తాను ఉమ్మడి ఎపి సిఎంగా ఉండగానే దేవాదుల ఎత్తిపోతలను ప్రారంభించానని గుర్తు చేశారు. గోదావరిలో ఏటా 2వేల క్యూసెక్కులకు పైగానే వృధ్థాగా సముద్రంలో కలుస్తోంది. వీటిని ఎవరు వాడుకున్నా మంచిదేనని, అందుకే వృదానీటి ద్వారా బనకచర్లకు పూనుకున్నామని అన్నారు. ఇందులో ఎవరు కూడా విమర్శలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. కుప్పం పర్యటనలో ఉన్న బాబు గురువారం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఎవరికీ నష్టం లేదని స్పష్టం చేశారు. సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే రెండు రాష్ట్రాలు బాగుపడతాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రాజెక్టలని తానెప్పుడూ వ్యతిరేకించలేదని స్పష్టత ఇచ్చారు. నీటి సమస్య పరిష్కారమైతే తెలుగువారు బాగుపడతారని ఉద్ఘాటించారు. వృథాగా సముద్రంలోకి పోయే వాటిలో 200 టీఎంసీలు వాడుకుంటే తెలుగు ప్రజలు బాగుపడతారు. నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఇదే విషయాన్ని పదే పదే చెబుతున్నా.. ఎవరికీ నష్టం లేదు. తెలంగాణలో గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులను ఎప్పుడూ నేను వ్యతిరేకించలేదు. వ్యతిరేకించను కూడా అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు తీవ్ర వమిర్శలు గుప్పించారు. సింగయ్య భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేస్తారా అని ప్రశ్నించారు. కారు కింద పడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించే ఓపిక కూడా లేదా అని ప్రశ్నించారు. కనీస బాధ్యత, సామాజిక స్పృహ లేకుండా ప్రవర్తిస్తారా అని నిలదీశారు. కారు కింద పడిన వ్యక్తిని కుక్కపిల్ల మాదిరిగా పక్కన పడేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారని ధ్వజమెత్తారు. నీతిమాలిన వాళ్లు, రౌడీలు రాజకీయాల్లో ఉన్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. చిల్లిగవ్వ కూడా ఖర్చు చేయని వాళ్లు తమ ప్రభుత్వం గురించి మాట్లాడు తున్నారని మండిపడ్డారు. దోచుకోవడమే తప్ప ఇవ్వడం తెలియని వాళ్లతో రాజకీయాలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలను మీరు ఆదుకోకపోగా.. పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పనులు తాత్కాలికం.. చేసిన పనులే శాశ్వతమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తానేప్పుడూ తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేయలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మామిడి రైతులకు తాము చేసినంత సాయం గతంలో ఎవరైనా ఇచ్చారా అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. శవ రాజకీయాలు చేసే వారు మామిడి రైతులపై ప్రేమ కురిపిస్తున్నారని అన్నారు. రైతుల ఇబ్బందులను తాము పరిష్కరిస్తామని.. రైతులకూ తమపై నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. మామిడి రైతుల గురించి.. వ్యవసాయం, హార్టీకల్చర్ గురించి ఏ మాత్రం పట్టించుకోని వారు ఇప్పుడు మాట్లాడతారా, మైక్రో సబ్సిడీలిచ్చారా అని ప్రశ్నించారు. హంద్రీనీవా పనులను తామే చేపడు తున్నామని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలోనే రూ.3980 కోట్లు ఖర్చు పెడుతున్నా మని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయంలో లాభాలు వస్తాయని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఇంటర్నేషనల్ మార్కెటింగ్‌పై చర్చిస్తున్నామని అన్నారు. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు చేయాలని సూచించారు. ప్రపంచంలో ఆహారపు అలవాట్లు మారాయని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఏ పంట వేస్తే లాభదాయకమో కూడా ఆలోచిస్తున్నామని అన్నారు. తమిళనాడులో లేని ఫుడ్ ప్రాసెసింగ్ ఏపీలో ఉందని ఉద్ఘాటించారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ వెళున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమలో ఒకేసారి రూ.3,950 కోట్లు హంద్రీనీవాకు డబ్బులిచ్చాం. మైక్రో ఇరిగేషన్‌కు 90శాతం సబ్సిడీ ఇస్తున్నాం. పంటలకు ప్రాధాన్యత ఇస్తూ గిట్టుబాటు వచ్చేలా చేస్తున్నాం. రైతుకు ఎక్కువ ఆదాయం రావాలని వాణిజ్య పంటలకు వెళ్లాం. అయితే, వాణిజ్య పంటల్లో ఒక్కోసారి తక్కువ రేట్లు కూడా వస్తాయి. అనేక ఇబ్బందులను అధిగమించి ముందుకెళ్తున్నాం. రైతులను అన్ని విధాలా ఆదుకునే ప్రభుత్వం మాది. గత ప్రభుత్వం ఒక్క బిడ్డకే అమ్మఒడి ఇచ్చింది. ఎంత మంది పిల్లలు ఉన్నా మేము తల్లికి వందనం ఇస్తున్నాం‘ అని సీఎం తెలిపారు. రైతులను అన్ని విధాలా ఆదుకునే ప్రభుత్వం తమది అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయంలో లాభాలు పెరుగుతాయి. పంటలకు ప్రాధాన్యత ఇస్తూ గిట్టుబాటు వచ్చేలా మేం చేస్తున్నాం. రైతుకు ఎక్కువ ఆదాయం రావాలని వాణిజ్య పంటలకు కూడా వెళ్లాం. ఒక్కోసారి తక్కువ రేట్లు కూడా వస్తాయి. అనేక ఇబ్బందులను అధిగమించి ముందుకెళ్తున్నాం’ అని సీఎం చంద్రబాబు అన్నారు.



# ఇవిఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయి

**2024 ఎన్నికలపై అనుమానాలు నివృత్తి చేయండి**

**వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పద్దతిలో నిర్వహించండి**

**ఇసిని కలిసి అనుమానాలు వెల్లడించిన వైకాపా నేతలు**

**న్యూఢిల్లీ,జూలై3(సమయజ్యోతి):** 2024 ఎన్నికల్లో ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘంను వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఎన్నికల నిర్వహణపై ఈసీ పునరాలోచించాలన్నారు. సాయంత్రం 6 తర్వాత ఏపీలోని ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగిందని, నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయన్నారు. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై ఈసీని విచారణ అడిగాం అని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈవీఎంలపై అనుమానాలను వ్యక్తం చేస్తూ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డిలు ఈసీని కలిశారు. ఈసీ సమావేశం అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. ’ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే నిర్వహించాలి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై పునరాలోచించాలి. ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలు, ఓటర్ లిస్టుల విషయంలో చర్చ జరిగింది. 2024 ఎన్నికలకు సంబంధించి అనుమానాల నివృత్తిపై సమావేశం నిర్వహించాం. 2024 ఎన్నికల్లో ఈవీఎంల తీరుపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరాం. ఈవీఎంలకు, వీవీప్యాట్‌లను కంపారిజన్ చేయమని అడిగాం. బ్యాటరీ చార్జింగ్ విషయంలో కూడా మా అనుమానాలను అడిగాం. పోలింగ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు బ్యాటరీ చార్జింగ్‌లో మార్పులను కూడా ప్రశ్నించాం. సాయంత్రం 6 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయి. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై విచారణ అడిగాం. వీవీప్యాట్‌ల విషయంలో కౌంటింగ్ చేయడానికి వీలులేదని ఎన్నికల సంఘం నిర్బంధంగా చెబుతోంది. బ్యాటరీ చార్జింగ్ విషయంలో రీఛార్జిబుల్ బ్యాటరీలు అని చెప్పారు. ఎక్కువ శాతం పెరిగిన ఓట్లపై పరిశీలిస్తామని ఎన్నికల అధికారులు చెప్పారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ సంఖ్య గణనీయంగా పెరిగింది. రాయచోటి నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య పెరిగింది. ఓటర్స్ డేటా తెప్పించి చూస్తామని చెప్పారు. బీహార్లో లాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. ఆంధ్రప్రదేశ్‌లో చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒప్పుకుంది. ఈవీఎంలపై టెక్నికల్ డౌట్స్ ఉన్నాయని ఆధారాలతో అడిగాం. హిందూపూర్‌లో పోలింగ్ బూతుల వివరాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించాం. క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. ఓడిపోయామని ఈవీఎంలపై నేపం చూపెట్టట్లేదు. ప్రాక్టికల్‌గా మా వద్ద ఉన్న ఆధారాలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు పెట్టాం. వైసీపీకి పార్లమెంట్లో 472 ఓట్లు వస్తే.. అసెంబ్లీలో ఒక ఓటు మాత్రమే వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్లో ఒక ఓటు వస్తే.. అసెంబ్లీకి 464 ఓట్లు వచ్చాయి. టీడీపీకి పార్లమెంట్లో 8 ఓట్లు వస్తే.. అసెంబ్లీకి 95 ఓట్లు వచ్చాయి.



# చేపల వేటలో విషాదం

## యువకుడిని లాక్కెళ్లిన భారీ చేప

**అనకాపల్లి,జూలై3(సమయజ్యోతి):** చేపల వేట విషాదం మిగిల్చింది. భారీ చేప ఒకటి యువకుడిని లాక్కెళ్లింది. దీంతో అతడి కోసం గాలించినా లాభం లేకుండా పోయింది. నసముద్రంలో చేపలవేటకు వెళ్లిన ఆ యువకుడు భారీ చేపను చేజిక్కించుకునే యత్నంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన చోడపల్లి యర్రయ్య (26).. ఆయన తమ్ముడు కొర్లయ్య, వాసుపల్లి యల్లాజి, గనగళ్ల అప్పలరాజులు బుధవారం తెల్లవారుజామున సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. తీరానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో వేట సాగిస్తుండగా.. గేలానికి సుమారు 100 కిలోల బరువుండే కొమ్ముకోనాం చేప చిక్కింది. దాన్ని యర్రయ్య తాడుతో బోటులోకి లాగే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో చేప యర్రయ్యను బలంగా నీటి లోపలికి లాక్కెళ్లిపోయింది. కళ్లముందే యర్రయ్య గల్లంతు కావడంతో కన్నీటిపర్యంతమైన ఆయన సోదరుడు కొర్లయ్య గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు పడవల్లో సాయంత్రం వరకు గాలించినా యువకుడి ఆచూకీ తెలియరాలేదు. దీంతో పూడిమడక గ్రామంలో విషాదం నెలకొంది. తల్లి కోదండమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

# జగన్‌ను కలిసిన వల్లభనేని వంశీ

## అండగా ఉంటామని హామీ

**అమరావతి,జూలై3(సమయజ్యోతి):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ మోహన్ కలిశారు. గురువారం తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లిన వంశీ.. కష్ట కాలంలో తనకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వంశీ ఆరోగ్య స్థితి గురించి వైఎస్ జగన్ ఆరా తీశారు. ఎప్పుడూ అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారు. వల్లభనేని వంశీ వెంట ఆయన సతీమణి పంకజశ్రీ కూడా ఉన్నారు. వల్లభనేని వంశీపై మొత్తం 11 కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో వంశీని ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు, దాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. కోర్టు రిమాండ్ విధించడంతో.. విజయవాడ సబ్ జైలులో 137 రోజులుగా రిమాండ్ ఖాదీగా ఉన్నారు. జైల్లో ఉన్న సమయంలోనే వంశీ అనారోగ్యం బారిన పడ్డారు. అన్ని కేసుల్లోనూ కోర్టులో ఊరట దక్కడంతో.. 137 రోజుల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చారు. బుధవారం ఉదయం విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు రాగానే వంశీని చూసి ఆయన సతీమణి పంకజశ్రీ ఎమోషనల్ అయ్యారు.

# ఉగ్రలింకులపై లోతుగా దర్యాప్తు

## జగన్‌కు జడ్ ప్లస్ భద్రత ఇప్పటికే ఉంది

## హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయనగరం,జులై 3(సమయజ్యోతి):** జగన్‌కు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పిస్తున్నా తనకు జెడ్ ప్లస్ పద్ధతి కల్పించాలని అడగటం దారుణమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. జగన్‌ను మించిన దగాకోరు ఈ దేశంలో ఎవరూ లేరని.. ఆయన పక్కనున్న సత్తిబాబు ఇంకా పెద్ద దగాకోరంటూ హోంమంత్రి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయనగరం, అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో ఉగ్ర లింకులు బయటపడటంపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ రెండు జిల్లాల్లో ఉగ్రలింకులు బయటపడటానికి గత ప్రభుత్వ ఉదాసీన వైఖరే కారణమని ఆరోపించారు. ఉగ్ర లింకుల కేసులో అరెస్ట్ అయిన సిరాజ్ తండ్రి పోలీస్ శాఖలో ఉండటం వల్ల దర్యాప్తు మరింత లోతుగా జరుగుతోందని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ మోహన్ రెడ్డి ఒక్కసారి కూడా గంజాయి నియంత్రణపై సమీక్షా సమావేశం జరిపిన ఆధారాలు లేవన్నారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం గంజాయి పండించే రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి కలిగించేలా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు నేపథ్యంలో పోలీసు బృందాలు రంగంలోకి దిగి విచారణను ముమ్మరం చేశాయి. అరెస్ట్ అయిన ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిక్ భార్య సైరా బాను, మహమ్మద్ అలీ భార్య షమీమ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని విచారించారు. అలాగే ఉగ్రవాది మహమ్మద్ అలీ వరుసకు సోదరుడు మహబూబ్ బాషా బావమరిది జమాల్‌నూ కాప్స్ అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ఉగ్రవాదుల భార్యలను పోలీసులు రాయచోటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చారు. ఇరువురికీ 14 రోజులు రిమాండ్ విధించింది న్యాయస్థానం. దీంతో వారిని పోలీసులు రాయచోటి సబ్‌జైలుకు తరలించారు.



# ఉగ్రవాదులు అల్ ఉమ్మా సభ్యులు

## పేలుళ్ల కుట్రలకు ఉపయోగించే ఇఐడి స్వాధీనం

## ఉగ్రవాదులకు సహకరించిన వారిపై ఆరా

## కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడి

**రాయచోటి,జులై 3(సమయజ్యోతి):** అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాల ఏర్పాటుపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. నిందితులిద్దరూ 'అల్ ఉమ్మా' ఉగ్రవాదులని తెలిపారు. దేశంలోని మూడు ప్రధాన నగరాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు. ఇటీవల రాయచోటిలో ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని తమిళనాడు ఐబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించిన పలు వివరాలను పోలీసు అధికారులతో కలిసి డీఐజీ వెల్లడించారు. ‘రాయచోటిలో నిందితులకు సహకరిస్తున్న వారిపై విచారణ చేస్తున్నాం. దాదాపు 50 ఐఈడీలు తయారు చేసే సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఐసిస్, అల్ ఉమ్మా ఒకే రకమైన భావజాలం కలిగి ఉంటాయి. 'అల్ ఉమ్మా' దక్షిణ భారత్‌లో అతిపెద్ద ఉగ్రవాద సంస్థ. తమిళనాడు పోలీసుల వివరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నాం. రాయచోటిలో నియామకాలు, శిక్షణ ఇచ్చినట్లు విచారణలో నిర్ధరణ కాలేదు. పేలుడు సామగ్రి ఎలా వచ్చిందనేదానిపై విచారణ చేపడుతున్నాం. ఈ కేసుపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. 20 ఏళ్లయినా చట్టం నుంచి తప్పించుకోరనడానికి ఇది నిదర్శనం. పేలుడు పదార్థాల గురించి ఉగ్రవాదుల కుటుంబసభ్యులకు తెలుసా? లేదా? అనేది అనుమానాస్పదంగా ఉంది. వారికి తెలిసే చేశారా? లేదా? అనేది విచారణలో తేలుతుంది. ఉగ్రవాదులు టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్. రాయచోటిలో స్థిరపడిన తర్వాత 2013లో బెంగళూరులోని మల్లేశ్వరంలో జరిగిన పేలుళ్లలో వీరి ప్రమేయం ఉంది‘ అని డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలతో పాటు ఫ్యూయల్ ఆయిల్ కలిపిన అమ్మోనియం నైట్రేట్, గన్ పౌడర్‌లు.. దేశంలోని మూడు ప్రధాన నగరాలు, రైల్వే నెట్‌వర్క్‌ల మ్యాప్‌లు దొరికాయని వివరించారు. ఇటీవల రాయచోటిలో ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని ఐబీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# జైస్వాల్ సెంచరీ మిస్..



భారత ఓపెనర్ యశస్వి జైశ్వాల్ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో మరోసారి అద్భుతంగా రాణించాడు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇండియా తరపున జైశ్వాల్ కేవలం 107 బంతుల్లో 13 ఫోర్లతో 87 పరుగులు చేసి అదరగొట్టాడు. అయితే, చిన్న తేడాతో తను ఓ పెద్ద రికార్డును మిస్ చేసుకున్నాడు. యశస్వి జైశ్వాల్ 2000 టెస్ట్ పరుగుల మైలురాయిని చేరుకోవడానికి కేవలం 10 పరుగుల దూరంలో ఆగిపోయాడు. ఒకవేళ ఈ మ్యాచ్‌లో అతను ఆ మార్క్‌ను దాటి ఉంటే, అత్యంత వేగంగా 2000 టెస్ట్ పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా హిస్టరీ క్రియేట్ చేసి ఉండేవాడు.ప్రస్తుతం జైశ్వాల్ తన కెరీర్లో తన 39వ టెస్ట్ ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అతను 2000 పరుగుల మార్క్‌ను దాటి ఉంటే, రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ ల రికార్డును అధిగమించి ఉండేవాడు. వీరిద్దరూ 40 ఇన్నింగ్స్‌లలో ఈ మైలురాయిని చేరుకున్నారు. కేవలం 21 టెస్ట్ మ్యాచ్‌లలోనే, జైశ్వాల్ ఇప్పటికే 1990 పరుగులు సాధించాడు. ఇందులో 5 సెంచరీలు, 12హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్వదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా అతని ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లలో తన ఎంట్రీ టెస్టుల్లోనే సెంచరీలను సాధించాడు.యశస్వి జైశ్వాల్‌కు ఇంగ్లాండ్‌పై ఆడడం బాగా నచ్చినట్లుంది. లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్టులో సెంచరీ సాధించిన తర్వాత, రెండో టెస్టులో ఏకంగా 87 పరుగులు చేశాడు. గతేడాది ఇంగ్లాండ్ భారత్‌లో పర్యటించినప్పుడు కూడా జైశ్వాల్ ఆ సిరీస్‌లో అద్భుతంగా ఆడి, ఐదు మ్యాచ్‌లలో రెండు డబుల్ సెంచరీలు బాదాడు. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ బ్యాట్‌తో మరోసారి ఆకట్టుకున్నప్పటికీ, సెంచరీని చాలా తక్కువ తేడాతో మిస్ చేసుకున్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో 87 పరుగుల వద్ద ఔటయ్యాడు.కేఎల్ రాహుల్‌తో కలిసి ఓపెనింగ్ బ్యాటింగ్‌కు వచ్చిన జైశ్వాల్, రాహుల్ కేవలం 2 పరుగులకే క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో ఔట్ అవ్వడంతో బాధ్యతను తన భుజాల మీద వేసుకున్నాడు. స్కోరు 15 పరుగుల వద్ద రాహుల్ ఔటైనప్పటికీ, జైశ్వాల్ ఎటువంటి ఆందోళన లేకుండా ఆడాడు.తను మొదట కరుణ్ నాయర్‌తో, ఆపై కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కీలక పార్టనర్ షిప్ బిల్డ్ చేశాడు. భారత్‌ను మంచి స్థితికి చేర్చాడు. జైశ్వాల్ దూకుడు ఆటతీరు ఇంగ్లాండ్ బౌలర్లను కలవరపెట్టింది. అయితే, 46వ ఓవర్‌లో స్టోక్స్ స్వయంగా బౌలింగ్‌కు వచ్చి మొదటి బంతికే వికెట్ తీశాడు. అతని మొదటి డెలివరీకే జైశ్వాల్ జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. జైశ్వాల్ 107 బంతుల్లో చేసిన 87 పరుగుల ఇన్నింగ్స్‌లో 13 బౌండరీలు ఉన్నాయి. డే 1లో భారత్ మంచి స్కోరు సాధించడంలో జైశ్వాల్ కీలక పాత్ర పోషించాడు.

# డోనోవన్ ఫెరీరా సునామీ ఇన్నింగ్స్



మేజర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఈ టోర్నీలో వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుపై టెక్సాస్ సూపర్ కింగ్స్ 43 పరుగుల తేడాతో విజయభేరి మోగించింది. వాషింగ్టన్ ఫ్రీడమ్-టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్ల మధ్య వర్షం కారణంగా మ్యాచ్‌ను 5 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు 5 వికెట్ల నష్టానికి 87 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు 5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 44 పరుగులే చేయగలిగింది.టెక్సాస్ సూపర్ కింగ్స్ ఓపెనర్లు మార్కస్ స్టొయినీస్(2), డార్లీ మిచెల్(6 రిటైర్డ్ హర్ట్) నిరాశపరిచినప్పటికీ.. శుభమ్ రంజనే(14 బంతుల్లో 39లి), డోనోవన్ ఫెరీరా( 9 బంతుల్లో 37లి) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. దక్షిణాఫ్రికాకు చెందిన డోనోవన్ ఫెరీరా.. ఆఖరి ఓవర్ వేసిన మిచెల్ ఓవెన్ బౌలింగ్‌లో 4 సిక్సర్లు, 2 డబుల్స్ సాయంతో ఏకంగా 28 రన్స్ బాదాడు. డోనోవన్ విధ్వంసకర బ్యాటింగ్ కు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. కాగా వాషింగ్టన్ ఫ్రీడమ్ బౌలర్లలో ఓ వికెట్ సాధించాడు. అంతకు ముందు 4వ ఓవర్లోనూ టెక్సాస్ కు 25 పరుగులు వచ్చాయి. తొలి 3 ఓవర్లలో 34 పరుగులు ఇచ్చిన వాషింగ్టన్ ఫ్రీడమ్.. చివరి 2 ఓవర్లలో ఏకంగా 54 పరుగులు సమర్పించుకుంది. అనంతరం 88 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు నిర్ణీత 5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 44 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్(18) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టెక్సాస్ సూపర్ కింగ్స్ బౌలర్లలో బర్గర్ 2, అకిల్ హుసేన్, నూర్ అహ్మద్ తలో వికెట్ సాధించారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే ఈ రెండు జట్లు తమ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకున్నాయి.ఫుట్‌బాల్ ప్లేయర్ డియోగో జోటా మృతి

# చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా



రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) చరిత్రలో 100 వికెట్లతో పాటు 2000 పరుగులు చేసిన ఏకైక ఆటగాడిగా రవీంద్ర జడేజా నిలిచాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా జడేజా ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో జడేజా తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు.137 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 89 పరుగులు చేశాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి 6వ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. ఈ క్రమంలో డబ్ల్యూటీసీలో 2000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. 2021లో డబ్ల్యూటీసీ ప్రారంభమవ్వగా..ఇప్పటి వరకు 41 మ్యాచ్‌లు ఆడిన జడేజా 25.92 సగటుతో 132 వికెట్లు తీయడంతో పాటు 2000 ప్లస్ రన్స్ చేశాడు. మరే ఆటగాడు కూడా ఈ ఫీట్ సాధించలేదు. డబ్ల్యూటీసీలో జడేజా ఇప్పటి వరకు మూడు సెంచరీలు చేశాడు. బౌలింగ్‌లో ఆరు సార్లు 5-వికెట్ల ఘనతను అందుకున్నాడు.ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో సెంచరీ దిశగా సాగిన జడేజాను జోష్ టంగ్ షార్ట్ పిచ్ డెలివరీతో కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. 310/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ లంచ్ బ్రేక్ సమయానికి 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. క్రీజులో శుభ్‌మన్ గిల్(168 బ్యాటింగ్)తో పాటు వాషింగ్టన్ సుందర్(1 బ్యాటింగ్) ఉన్నారు. తొలి సెషన్‌లో భారత్ 25 ఓవర్లు ఆడి ఒకే ఒక్క వికెట్ కోల్పోయి 109 పరుగులు చేసింది.

# భారీ సిక్సలతో రెచ్చిపోతున్న వైభవ్ సూర్యవంశీ

వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో ఆడుతున్నాడు. అక్కడ తనలోని మరో కోణాన్ని చూపిస్తూ, భారీ సిక్సలతో రెచ్చిపోతున్నాడు. ఈ క్రమంలో జట్టుకు విజయాలు అందిస్తూ సంచలనంగా మారాడు. అండర్ 19 సిరీస్‌లోని మూడవ వన్డేలో కేవలం 14 పరుగుల తేడాతో తన సెంచరీని కోల్పోయాడు. కానీ, ఆ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఏకంగా 24 మంది బ్యాటర్ల కంటే రెండు అడుగులు ముందున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.భారత్ యు19 వర్సెస్ ఇంగ్లాండ్ యు19 మధ్య జరుగుతున్న యూత్ సిరీస్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. ముఖ్యంగా సిక్సర్లు కొట్టడంలోనూ, తన స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థులను భయపెడుతూ దూసుకెళుతున్నాడు. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన, గత రికార్డులను పరిశీలిస్తే ఎంత అద్భుతంగా రాణించాడో స్పష్టమవుతుంది. రెండు జట్ల మధ్య 5 వన్డే మ్యాచ్‌ల సిరీస్ జరుగుతోంది. కాగా, ఇప్పటికే 3 మ్యాచ్‌లు ముగిశాయి. ఆ 3 మ్యాచ్‌లలో మొత్తం 25 మంది బ్యాటర్లు క్రీజులో తమ బలాన్ని చూపించారు. వారిలో ఒకరు వైభవ్ సూర్యవంశీ. కానీ వైభవ్ సూర్యవంశీ దరిదాపుల్లో కూడా ఎవరూ లేకపోవడం గమనార్హం. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో యూత్ వన్డేలో వైభవ్ సూర్యవంశీ కేవలం 31 బంతుల్లో 86 పరుగులు చేసి భారత జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 6 ఫోర్లు, రికార్డుస్థాయిలో 9 సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ ఏకంగా 277.41గా నమోదైంది. కేవలం 20 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఇది భారత %ఖ%19 క్రికెట్‌లో రిషబ్ పంత్ (18 బంతుల్లో) తర్వాత రెండో అత్యంత వేగవంతమైన అర్ధశతకం. తన 86 పరుగులలో 78 పరుగులు బౌండరీలు, సిక్సర్ల రూపంలోనే వచ్చాయి. ఇది అతని విధ్వంసకర బ్యాటింగ్‌కు నిదర్శనం. ఇంగ్లాండ్‌పై కొట్టిన 9 సిక్సర్లతో, వైభవ్ సూర్యవంశీ %ఖ%19 వన్డేలలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు మన్‌దీప్ సింగ్ (8 సిక్సర్లు) పేరిట ఉండేది. 20 బంతుల్లోనే అర్ధశతకం సాధించి, భారత %ఖ%19 క్రికెట్‌లో రిషబ్ పంత్ తర్వాత రెండో వేగవంతమైన అర్ధశతకకారిగా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ ఈ సిరీస్‌లో ఇప్పటివరకు 179 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. అతని ప్రస్తుత సిరీస్ స్ట్రైక్ రేట్ 213.09. మిగిలిన ఏ భారత %ఖ%19 బ్యాట్స్‌మెన్ కూడా సిక్సర్ల సంఖ్యలో లేదా స్ట్రైక్ రేట్‌లో వైభవ్ సూర్యవంశీకి దరిదాపుల్లో కూడా లేరు. అతని దూకుడైన ఆటతీరు, బౌండరీలు కొట్టే సామర్థ్యం, ముఖ్యంగా సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచడం అతన్ని ప్రత్యేకంగా నిలబెడుతోంది. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇటువంటి అద్భుతమైన ప్రదర్శనలు ఇస్తున్న వైభవ్ సూర్యవంశీ, భారత క్రికెట్‌కు ఒక గొప్ప ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. అతని అసాధారణ బ్యాటింగ్ సామర్థ్యం, సిక్సర్లు కొట్టే నైపుణ్యం చూస్తుంటే, అతను త్వరలోనే సీనియర్ జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





# ఫుట్‌బాల్ ప్లేయర్ డియోగో జోటా మృతి


స్పెయిన్‌లోని జమోరా ప్రావిన్స్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు డియోగో జోటా గురువారం మృతి చెందాడు. మార్కా నివేదిక ప్రకారం సనాబ్రియాలోని జమోరా ప్రాంతానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పోర్చుగల్‌లోని పెనాఫీల్‌కు చెందిన డియోగో జోటా తన సోదరుడు ఆండ్రీతో కలిసి ట్రావెల్ చేస్తున్న టైంలో ప్రమాదం జరిగింది. వారు వెళ్తున్న క్రమంలోనే కారు ప్రమాదానికి గురైంది. కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ మంటల ధాటికి చుట్టుపక్కల ప్రదేశం కూడా ఎఫెక్ట్ అయినట్టు స్థానికులు చెబుతున్నారు. డియోగో జోటాకు పది రోజుల క్రితమే రూట్ కార్డోసోతో వివాహమైంది. డైలీ మెయిల్ ప్రకారం, కాస్టిల్లా, లియోన్ ప్రాంతంలోని పోలీసు వర్గాలు కూడా ఈ ప్రమాదాన్ని నిర్ధారించాయి. "జమోరాలోని సెర్నాడిల్లా మునిసిపాలిటీలోని %ూ%-52 65 కి.మీ. వద్ద వాహనం ప్రమాదానికి గురైనట్టు 1-1-2 కాస్టిల్లా వై లియోన్ ఆపరేషన్స్ రూమ్‌కు చాలా కాల్స్ వచ్చాయి. కారు ప్రమాదంలో చిక్కుకొని కాలిపోయినట్లు చెప్పారు" అని ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. "అక్కడి నుంచి, మొంబుయ్ హెల్త్ సెంటర్ నుంచి మెడికల్ ఎమర్జెన్సీ యూనిట్, ప్రైమరీ కేర్ మెడికల్ స్టాఫ్ ప్రమాద స్థలానికి చేరుకున్నారు. స్పాట్‌లోనే ఇద్దరు వ్యక్తుల మరణించినట్టు నిర్ధారించారు." పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య చీఫ్ పెడ్రో ప్రోయెంకా ఈ ఘటనపై స్పందించారు. "ఈ ఉదయం స్పెయిన్‌లో డియోగో జోటా, ఆండ్రీ సిల్వా మరణించారని తెలిసింది. ఇది పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య, మొత్తం పోర్చుగీస్ ఫుట్‌బాల్‌కు తీరని నష్టం." అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

"చాలా కాలంగా డియోగో జోటా అద్భుతమైన ఆడగాడు. జాతీయ %ూ% జట్టుకు దాదాపు 50కుపైగా ట్రోఫీలు అందించాడు. డియోగో జోటా ఒక అసాధారణ వ్యక్తి, అన్ని సహచరులు, ప్రత్యర్థులను గౌరవించేవాడు. నా తరపున, పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య తరపున, డియోగో, ఆండ్రే సిల్వా కుటుంబ సభ్యులు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను."అని అన్నారు. జూన్ 28న రూట్ కార్డోసోను జోటా వివాహం చేసుకున్నారు. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడం అతను ప్రాణాలు కోల్పోవడం ఆయన కుటుంబ సభ్యులను, అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

# రామాయణం ఎప్పటికీ ఆదరణీయ కావ్యం

## బాలీవుడ్ రామాయణ గ్లింప్స్ విడుదల

యుగాలు మారినా.. తరాలు మారినా.. విన్న ప్రతిసారీ భక్తిభావంతో ఓలలాడించే కావ్యం రామాయణం. ఇప్పుడీ కథను బాలీవుడ్ 'రామాయణ' సినిమాగా మన ముందుకు తెస్తోంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి రావణుడిగా యశ్ నటించిన 'రామాయణ' గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేసింది. 'ముల్లోకాలను త్రిమూర్తులు పరిపాలిస్తున్నారు. బ్రహ్మ.. సృష్టించే దేవుడు; విష్ణువు.. రక్షించే దేవుడు; శివుడు.. అంతం చేయగలిగే దేవుడు. కానీ, వారు సృష్టించిన మూడు లోకాలపై ఆధిపత్యం కోసం ఎదురు తిరిగినప్పుడు అన్ని యుద్ధాలను అంతం చేసే యుద్ధం ప్రారంభమైంది. 5వేల సంవత్సరాల నుంచి 2500 కోట్ల మంది ప్రజలు ఆరాధించేది. ఇది ఒక అమరమైన ఇతిహాసగాథ.. రామాయణం మన వాస్తవం.. మన చరిత్ర' అంటూ గ్లింప్స్‌ను పంచుకుంది. ఇక ఇందులో లక్ష్మణుడిగా రవి దుబే, హనుమంతుడిగా సన్నీ దేఓల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ పై ఎన్నో రామాయణ కథలు సినిమాలుగా వచ్చి సూపర్ హిట్ గా నిలిచాయి. ఇంకా మరెన్నో సినిమాలు వస్తూనే ఉంటయి. అందుకే రామాయణం ఎపిక్. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా బాలీవుడ్ లో రామాయణ ఇతిహాసంలో 'రామాయణ' అనే సినిమా వస్తుంది. ఇక ఈ కథలో కీలకమైన రావణాసురిడి పాత్రలో కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్నాడు. ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా స్టార్ట్ అయిన ఈ సినిమా షూటింగ్ చకచక జరుగుతోంది. కానీ ఈ సినిమాకు సంబంధించి కనీసం ఒక పోస్టర్ ను కూడా రిలీజ్ చేయలేదు మేకర్స్. రణబీర్ రాముడు పాత్రలో నటిస్తుండడంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇన్ని రోజులు ఈ సినిమా ఎలా ఉంటుందా అని ఎదుచూసిన మేకర్స్ చిన్న పాటి గ్లిమ్స్ తో వీడియో రిలీజ్ చేసారు. ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారో తెలియాజేస్తూ చివరిలో యష్ ను లుక్ ను చూపిస్తూ ఎండ్ లో రాముడుగా రణబీర్ ఎంట్రీ ఫ్రెమ్ ఓ రేంజ్ లో ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే రామయణ ఇంట్రడక్షన్ ఊహించిన దానికి మించి ఉండబోతుందని తెలుస్తోంది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్ టాప్ క్లాస్ ఉంది. భారీ బ్జడెట్ పై తెరకెక్కుతున్న ' రామాయణ' ఫస్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళి కానుకగా రిలీజ్ కానుంది. సెకాండ్ పార్ట్ ను 2027 దీపావళికానుకగా రిలీజ్ చేస్తామని తెలిపారు



# హక్కుల కోసం పోరాడే తల్లి పాత్రే..మైసా

ప్రస్తుతం ఇండస్ట్రీలో వరుస హిట్లతో దూసుకెళ్తున్న స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న 'యానిమల్', 'పుష్ప 2', 'ఛావా' ఇలా బ్లాక్ బస్టర్ హిట్లతో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఇక ఆమె తాజాగా నటించబోతున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మైసా. ఈ ప్రాజెక్టు నుంచి రష్మిక ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో విపరీతమైన హైప్ క్రియేట్ అవుతుంది. ఇప్పటి వరకు ఎన్నడూ లేని విధంగా రక్తంతో ముఖం, చేతిలో ఆయుధం, ముక్కుపుడకతో ఆమె లుక్ చూసి అంతా షాక్ అయ్యారు. 'ధైర్యం ఆమె బలం..ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి..' అంటూ ఇచ్చిన హైప్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇక..'మైసా' అనే టైటిల్ అనౌన్స్ చేయగానే అందరిలోనూ ఓ ఆసక్తి నెలకొంది. అసలు మైసా అంటే ఏంటనే ప్రశ్నలు మొదలు అయ్యాయి. రష్మిక లుక్‌కు ఈ పేరుకు సంబంధం ఏంటి? అంటూ సోషల్ మీడియాలో పెద్ద చర్చే సాగింది. అయితే 'మైసా' అనే పదం వివిధ భాషల మూలాల నుంచి తీసుకున్నారు. స్వీడిష్, అరబిక్, జపనీస్, జార్జియన్ భాషల్లో 'మైసా' అనే పదానికి 'తల్లి' అని అర్థం. స్వేచ్ఛా భావాలతో, సహజ నాయకత్వంలో ముందుకు సాగిన ఓ సాహసవంతురాలి పాత్రకు ఇది సరైన టైటిల్ అని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో రష్మిక వారియర్ మదర్ కనిపించనున్నారు. గోండు తెగల పటిష్ఠమైన సామాజిక నేపథ్యం ఆధారంగా ఈ కథ సాగనుంది. ఈ తెగల హక్కుల కోసం పోరాడే ఓ తల్లిగా, నాయకురాలిగా రష్మిక పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. ఆమె పాత్రలో ఉన్న తీవ్రత, ఎమోషన్‌ను ఫస్ట్ లుక్ స్పష్టంగా అర్థమవుతుంది.



# ధనుష్ అత్యుత్తమ నటుల్లో ఒకరు

## 'తేరే ఇష్క్ మే గురించి కృతి సనన్

కోలీవుడ్ హీరో ధనుష్ తన నటనతో ఇప్పటికే తమిళ ప్రేక్షకుల మనసులు గెలుచుకోగా.. అతని టాలెంట్ అక్కడే ఆగలేదు.. బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల్లోనూ చక్కటి నటనతో తిరుగులేని మార్కెట్ సంపాదించు కున్నారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా, 'రాంజనా', 'అత్రంగి రే' తర్వాత ధనుష్ ఆనంద్ కలయికలో వచ్చిన మూడో సినిమా ఇది. తాజా అప్డేట్ ప్రకారం ఈ సినిమా షూటింగ్ పూర్తి అయిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కృతి సనన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ షేర్ చేస్తూ ధనుష్‌పై ప్రశంసల జల్లు కురిపించింది. నేను ఇప్పటి వరకు కలిసి పనిచేసిన అత్యుత్తమ నటుల్లో ధనుష్ ఒకరు. అతనితో పని చేయడం సంతోషంగా ఉంది. ఈ జర్నీ ఎంతో స్పెషల్‌గా మిగిలిపోతుంది' అని పేర్కొంది. అలాగే, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ గురించి కూడా ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది.. 'ఈ సినిమాకు నన్ను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు సర్. ఇది ఓ రోలర్ కోస్టర్ రైడ్‌లా వేగంగా పూర్తయిపోయింది' అని తెలిపింది. ఇది ధనుష్, కృతి సనన్ జంటగా నటిస్తున్న మొదటి సినిమా, అందుకే ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో మంచి క్యూరియాసిటీ నెలకొంది.



# విడుదలవుతున్న తమ్ముడు

## తమ్ముడు ప్రమోషన్లకు దూరంగా నితిన్

రాబిన్‌హుడ్ తర్వాత నితిన్ నుండి వస్తోన్న మూవీ తమ్ముడు. వేణు శ్రీరామ్ దర్శకుడు. ఈ శుక్రవారం థియేటర్లలోకి రాబోతుంది. ఈ సినిమాతో నితిన్ బౌన్స్‌బ్యాక్ అవుతాడని మేకర్స్ గట్టిగానేచెబుతున్నారు. కానీ నితిన్ మాత్రంసైలెంట్‌గా స్మైల్ ఇస్తున్నాడు. చెప్పాలంటే పెద్దగా ప్రమోషన్లలో పార్టిసిపేట్ చేయడంలేదు. మరి ప్రమోషన్ల సంగతేంటీ అంటే వాటిని మేకర్స్‌తో పాటు హీరోయిన్స్ భుజానకెత్తుకున్నారు .సినిమా ఎనౌన్స్‌మెంట్ నుండి రిలీజ్ వరకు మేకర్లతో పాటు భుజాన వేసుకుని చేస్తున్నారు హీరోయిన్స్. హాయ్, బై చెప్పామా అనికాకుండా అవసరమైనప్పుడల్లా లయ, వర్ష బొల్లమ్మ, స్వసిక, సప్తమి గౌడలు తమ్ముడు టీమ్‌కి అండగా నిలుస్తున్నారు. దర్శకుడు వేణు శ్రీరామ్‌తో కలిసి ప్రమోషన్లను చేస్తున్నారు. తమ్ముడు ఎనౌన్స్ మెంట్ నుండి ప్రీ రిలీజ్ ఈవెంట్స్ వరకు వరుస ఇంటర్వ్యూలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. మరి ఈ ప్రమోషన్లుఎంత వరకు వర్కౌట్ అయ్యాయి అంటే సినిమాపై గట్టి బజ్ నడిచేలా ఇంపాక్ట్ క్రియేట్ చేయగలిగాయి. తమ్ముడు అటు దర్శకుడికి, ఇటు హీరోకి చాలా కీలకం.అలాంటిది నితిన్ ప్రమోషన్స్ ఏ లెవల్లోచేయాలి.. కానీ కామ్‌గా ఉంటున్నాడు.దీనికి కారణం రాబిన్ హుడ్ డిజాస్టర్.హిట్ కాంబోలో తెరకెక్కిన రాబిన్ హుడ్‌పైఎన్నో హోప్స్ పెట్టుకున్నాడు నితిన్. ఆ సినిమా ప్రమోషన్స్ లో ఎక్కడ చూసినా నితినే కనిపించాడు. కానీ ఆ సినిమా డిజిస్టార్ తో ఒక్కసారిగా డీలా పడిపోయాడు. ఇప్పుడుప్రమోషన్లకు దూరంగా ఉండటానికి ఇదే కారణమంటున్నారు.




# పులిని వేటాడే బెబ్బులి అదిరిపోయేలా హరిహరవీరమల్లు ట్రైలర్

పవన్ ఫాన్స్‌కు పండగే పండగ. హరిహర వీరమల్లు థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. దాదాపు మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ ట్రైలర్ పవన్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ పట్టేలా.. విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంది. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్టుగా.. అద్భుతమైన విజువల్స్‌తో హరిహర వీరమల్లు ట్రైలర్ అదిరి పోయింది. మూడే మూడు డైలాగ్స్‌తో సినిమా కథను చెప్పేశారు. హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం, ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం, ఒక వీరుడు కోసం ప్రకృతి పురుడు పోసుకుంటున్న సమయం.. అంటూ మొఘలులను ఎదురించిన వీరుని కథే హరిహర వీరమల్లు కథ అని చెప్పేశారు. కోహినూర్ డైమండ్ అంటూ పవన్‌కి ఇచ్చిన ఎలివేషన్ పీక్స్ అనే చెప్పాలి. పవర్ స్టార్ చెప్పిన డైలాగ్స్ బాగున్నాయి. పులిని వేటాడే బెబ్బులిని చూస్తారు అంటూ.. పవన్ చెప్పిన డైలాగ్ విజిల్స్ వేసేలా ఉంది. అలాగే.. మన దేశ ప్రధాని మోదీ పవన్ గురించి చెప్పిన 'యే పవన్ నహీ ఆంధీ హై' డైలాగ్‌ను ట్రైలర్‌లో హైలెట్ చేశారు. విలన్ బాబీ డియోల్ చేత.. ఆంధీ వచ్చేసింది అంటూ ఎలివేషన్ ఇచ్చారు. ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్‌ను పవర్ ఫుల్‌గా చూపించారు. ఇక పవన్ లుక్, యాక్షన్, విజువల్ పరంగా ట్రైలర్ అదరహో అనేలా ఉంది. కాకపోతే.. కొన్ని ఫ్రేమ్స్‌లో సీజీ వర్క్ పై ఇంకాస్త దృష్టి పెట్టాల్సింది. కానీ పీరియాడికల్ సెటప్ మాత్రం అదిరిపోయింది. నిర్మాత ఏఎం.రత్నం పెట్టిన బ్జడెట్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. హీరోయిన్ నిధి అగర్వాల్‌కు మంచి పాత్ర పడినట్టుగా ఉంది. ఆస్కార్ విన్నర్ ఎంఎం. కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. మొత్తంగా.. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించేలా ఉంది ఈ ట్రైలర్. ఇక్కడితో సినిమా పై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685